
ఆర్డీఓతో కలిసి ఏర్పాట్లను పరిశీలిస్తున్న పయ్యావుల కేశవ్

చరిత్రలో నిలిచిపోయేలా సభ

పీఏసీ చైర్మన్ పయ్యావుల కేశవ్

రా.. కదలిరాకు ముమ్మర ఏర్పాట్లు

ఉరవకొండ, జనవరి 25: టీడీపీ అధినేత చంద్రబాబు నేతృత్వంలో ఉరవకొండలో రా కదలిరా సభను చరిత్రలో నిలిచిపోయేలా నిర్వహిస్తామని పీఏసీ చైర్మన్, ఎమ్మెల్యే పయ్యావుల కేశవ్ అన్నారు. పట్టణ శివారులో సభ ఏర్పాట్లను గురువారం ఆయన పరిశీలించారు. సభా వేదిక, హెలిప్యాడ్ ప్రాంతాలను నాయకులు, కార్యకర్తలతో కలిసి సందర్శించారు. ఈ నెల 27న ఉవరకొండలో జరిగే 'రా.. కదలిరా' సభకు తరలి వచ్చేందుకు ప్రజలు సిద్ధంగా ఉన్నారని కేశవ్ అన్నారు. వైసీపీ పాలనలో అన్ని వర్గాల ప్రజలు మోసపోయారని విమర్శించారు. రాబోవు ఎన్నికల్లో టీడీపీ-జనసేన కూటమి విజయం తథ్యమని అన్నారు. కార్యక్రమంలో టీడీపీ జిల్లా ప్రధాన కార్యదర్శి శ్రీధర్ చౌదరి, మార్కెట్‌యార్డు మాజీ చైర్మన్ దేవినేని పురుషోత్తం, మాజీ ఎంపీపీ సుంకరత్నమ్మ తదితరులు పాల్గొన్నారు.

భారీ భద్రత

టీడీపీ అధినేత చంద్రబాబుకు జడ్ ప్లస్ కేటగిరీ భద్రత ఉండటంతో భారీ బందోబస్తు ఏర్పాటు చేస్తున్నారు. గుంతకల్లు డీఎస్పీ నరసింగప్ప సభా ప్రాగంణం, హెలిప్యాడ్ స్థలాలను పరిశీలించారు. టీడీపీ నాయకులతో మాట్లాడారు. గుంతకల్లు ఆర్డీవో శ్రీనివాసులు రెడ్డి హెలిప్యాడ్ స్థలాన్ని పరిశీలించారు. వేదిక, బారికేడ్లు, హెలిప్యాడ్ , పార్కింగ్ పనులు శరవేగంగా సాగుతున్నాయి.


హెలిప్యాడ్ స్థలాన్ని పరిశీలిస్తున్న డీఎస్పీ నరసింగప్ప


గణతంత్ర వేడుకలకు ముస్తాబైన వేదిక


మువ్వన్నెల క్లాక్ టవర్

సంబరాలకు సిద్ధం

నేడు గణతంత్ర దినోత్సవం

పోలీస్ పరేడ్ మైదానంలో ఏర్పాట్లు

అనంతపురం టౌన్, జనవరి 25: గణతంత్ర వేడుకలకు జిల్లా వ్యాప్తంగా ఏర్పాట్లు చేసుకున్నారు. జిల్లా కేంద్రంలోని క్లాక్ టవర్‌ను జాతీయ జెండాను తలపించేలా మూడు రంగుల విద్యుద్దీపాలతో అలంకరించారు. నగరంలోని పోలీస్ పరేడ్ మైదానం వేడుకలకు ముస్తాబైంది. కలెక్టర్ గౌతమి శుక్రవారం జాతీయ జెండాను ఆవిష్కరిస్తారు. ప్రజా ప్రతినిధులు, అధికారులు, సామాజిక సేవకులు, పలువురు ప్రముఖులకు జిల్లా అధికార యంత్రాంగం నుంచి ఆహ్వానం అందింది. వేడుకలను తిలకించేందుకు వచ్చే అతిథులు, ప్రజల కోసం ఏర్పాట్లు చేశారు. ఏర్పాట్లను జేసీ కేతన్ గార్గ్ పర్యవేక్షించారు. సాంస్కృతిక ప్రదర్శనలు, వివిధ శాఖల శకటాలు, స్టాల్స్ వేడుకలలో ప్రత్యేక ఆకర్షణగా నిలువనున్నాయి. పోలీసు అధికారులు వివిధ విభాగాల సిబ్బంది చేత గురువారం రిహార్సల్ చేయించారు.


పోలీస్ పరేడ్ మైదానంలో పోలీసుల రిహార్సల్స్


వేడుకల ఏర్పాట్లను పరిశీలిస్తున్న జాయింట్ కలెక్టర్ కేతన్‌గార్గ్


విద్యుత్ కాంతుల్లో కలెక్టరేట్

520 మందికి పురస్కారాలు

గణతంత్ర వేడుకల సందర్భంగా ఉత్తమ సేవలు అందించిన అధికారులు, ఉద్యోగులు, సామాజిక సేవకులకు పురస్కారాలను ప్రదానం చేయనున్నారు. వివిధ శాఖల నుంచి పురస్కారాల కోసం ప్రతిపాదనలు కలెక్టర్‌కు చేరాయి. పలువురు పైరవీలు చేసుకున్నట్లు ప్రచారం జరుగుతోంది. ఈ క్రమంలో ఏటా పురస్కార గ్రహీతల జాబితా భారీగా ఉంటోంది. అర్ధరాత్రి వరకూ జాబితాను ప్రకటించడం లేదు. ఈ ఏడాది సైతం ఇదే పరిస్థితి కనిపిస్తోంది. మొత్తం 520 మందిని పురస్కారాలకు ఎంపిక చేశామని అధికారులు తెలిపారు.

ఖాతాదారుల సేవా కేంద్రంలో మాయ

రూ.50 లక్షలు కాజేసిన నిర్వాహకుడు..?

రాయదుర్గం, జనవరి 25: పట్టణంలోని ఎస్‌బీఐ ఖాతాదారుల సేవా కేంద్రంలో జీరో అకౌంట్ పేరిట రూ.50 లక్షల దాకా గోల్‌మాల్ చేశారని తెలిసింది. ఆ కేంద్రం నిర్వాహకుడు అమాయకులను మోసగించి సొమ్ము దోచుకున్నట్లు సమాచారం. దీనిపై బాధితులు బ్యాంకు అధికారులకు, పోలీసులకు ఫిర్యాదు చేశారు. బ్యాంకు ఖాతాదారుల సేవా కేంద్రాన్ని ప్రైవేట్ వ్యక్తుల ఆధ్వర్యంలో నిర్వహిస్తారు. గ్రామీణ ప్రజల పేరిట జీరో ఖాతా తెరవడం, నగదు తీసుకోవడం వంటి సేవలను ఇక్కడ అందిస్తారు. జీరో ఖాతాలలో ఉన్న సొమ్మును ఖాతాదారులకు తెలియకుండా ట్రాన్స్‌ఫర్ చేయడం, విత్ డ్రా చేయడం వంటి అక్రమాలకు పాల్పడినట్లు విశ్వసనీయంగా తెలిసింది. ఖాతా నుంచి సొమ్ము విత్ డ్రా చేయడానికి వేలిముద్ర వేయాల్సి ఉంటుంది. ఈ విషయంలో ఖాతాదారులకు అనుమానం రాకుండా నిర్వాహకుడు మాయ చేశాడని అంటున్నారు. తమ ఖాతాలోని సొమ్ము తమ ప్రమేయం లేకుండా విత్ డ్రా అయినట్లు గుర్తించిన కొందరు.. అధికారులకు ఫిర్యాదు చేశారు. బ్యాంకు అధికారులు ఇప్పటికే జరిగిన మోసాన్ని నిర్ధారించుకుని, పైస్థాయి అధికారులకు తెలిపినట్లు సమాచారం. దీనిపై ఎస్‌బీఐ బ్రాంచ్ మేనేజర్ మృత్యుంజయను వివరణ కోరగా, కేసు నమోదుకు అవసరమైన పూర్తిస్థాయి ఆధారాలను ఉన్నతాధికారుల అనుమతితో సమర్పించే పనిలో ఉన్నామని తెలిపారు. బాధితులు తమకు ఫిర్యాదు చేశారని, ఆధారాలను ఇవ్వాలని బ్యాంకర్లను కోరామని అర్బన్ సీఐ శ్రీనివాసులు తెలిపారు. ఎంత సొమ్ము మాయమైందన్న విషయం విచారణలో తెలుస్తుందని అన్నారు.

ఎప్పుడిస్తారు..?

ట్రాన్స్‌ఫార్మర్‌ల కోసం రైతుల నిరీక్షణ

ఎమ్మెల్యే సిఫారసు ఉంటే వెంటనే ఇస్తారు..!


ట్రాన్స్‌ఫార్మర్ ఏర్పాటు కోసం నిర్మించిన దిమ్మె

యాడికి, జనవరి 25: వ్యవసాయ విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్ల కోసం రైతులు నెలల తరబడి నిరీక్షించాల్సి వస్తోంది. దరఖాస్తులు, డీడీలు ఇచ్చి నెలలు గడిచినా ట్రాన్స్‌ఫార్మర్లను ఇవ్వడం లేదని రైతులు వాపోతున్నారు. అధికార పార్టీ ప్రజా ప్రతినిధులు సిఫారసు చేసిన వారికి మాత్రం ప్రాధాన్యం లభిస్తోంది. మండలవ్యాప్తంగా 48 మంది రైతులు ట్రాన్స్‌ఫార్మర్ల కోసం దరఖాస్తు చేసుకున్నారు. ఆన్‌లైన్‌లో నగదు చెల్లించారు. గత ఏడాది జూన్, జూలైలో దరఖాస్తు చేసిన రైతులకు ఇప్పటికీ ట్రాన్స్‌ఫార్మర్‌లు ఇవ్వలేదు. విద్యుత్ శాఖ కార్యాలయం చుట్టూ తిరిగి విసిగిపోయామని బాధిత రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. అధికారులు రైతుల ఇబ్బందులను పట్టించుకోవడం లేదని, కానీ ఎమ్మెల్యే సిఫారసు లెటర్ ఇస్తే మాత్రం వెంటనే ట్రాన్స్‌ఫార్మర్ ఇస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. సామాన్య రైతులు ఎమ్మెల్యే వద్దకు వెళ్లి సిఫారసు లేఖలను తెచ్చుకోవడం సాధ్యమేనా అని ప్రశ్నిస్తున్నారు. విద్యుత్ శాఖ అధికారులను నిలదీస్తే, సీనియారిటీ ప్రకారం ఇస్తున్నామని బుకాయిస్తున్నారని మండిపడుతున్నారు. లక్షల రూపాయలు పెట్టి బోరు బావులు తవ్వించుకున్నామని, నీరు పడ్డాక నెలల తరబడి ట్రాన్స్‌ఫార్మర్ల కోసం వేచి చూడాల్సి వస్తోందని ఆవేదన వ్యక్తం చేశారు. తక్షణమే ట్రాన్స్‌ఫార్మర్లను మంజూరు చేయాలని కోరుతున్నారు.


ఎమ్మెల్యే సిఫారసుతో ట్రాన్స్‌ఫార్మర్ వెంటనే ఇవ్వాలని ఉన్నతాధికారుల ఉత్తర్వు

సీనియారిటీ ప్రకారమే ఇస్తున్నాం..

ట్రాన్స్‌ఫార్మర్లను సీనియారిటీ ప్రకారమే మంజూరు చేస్తున్నాం. ఉన్నతాధికారుల నుంచి వస్తున్న జాబితా ప్రకారమే ట్రాన్స్‌ఫార్మర్లను ఇస్తున్నాం. పైనుంచి ట్రాన్స్‌ఫార్మర్లు రాకపోతే మేమేం చేయగలం..? మండలవ్యాప్తంగా 48 మంది రైతులకు ట్రాన్స్‌ఫార్మర్లను ఇవ్వాల్సి ఉంది. మంజూరైన వెంటనే అందిస్తాం.

- రాజారావు, ట్రాన్స్‌కో ఏఈ

ఆరు నెలలుగా ఎదురుచూస్తున్నా..



లక్ష రూపాయలకు పైగా ఖర్చుచేసి బోరు వేశాను. ట్రాన్స్‌ఫార్మర్ కోసం డబ్బులు చెల్లించాను. ఆరునెలల నుంచి విద్యుత్ శాఖ కార్యాలయం చుట్టూ తిరుగుతున్నాను. అడుగుతుంటే ఏవేవో మాటలు చెప్పి పంపుతున్నారు. ట్రాన్స్‌ఫార్మర్ ఇచ్చి ఉంటే ఈ పాటికి ఒక పంట తీసేవాళ్లం. రైతులకు ట్రాన్స్‌ఫార్మర్లను వెంటనే మంజూరు చేసేలా అధికారులు చర్యలు తీసుకోవాలి.

- నరసింహ, యాడికి

అదిగో, ఇదిగో అంటున్నారు..



ట్రాన్స్‌ఫార్మర్ల కోసం దరఖాస్తు చేసుకొని నెలలు గడుస్తోంది. ఆన్‌లైన్‌లో డబ్బులు కూడా చెల్లించాము. ఇంతవరకు ట్రాన్స్‌ఫార్మర్ మంజూరు చేయలేదు. బోరుబావి వేయడం కోసం లక్షల రూపాయలు ఖర్చు చేశాను. ఇంత ఖర్చుచేసి పొలాలను బీడు పెట్టుకోవాల్సి వస్తోంది. అధికారులు వెంటనే ట్రాన్స్‌ఫార్మర్‌ను మంజూరు చేయాలి.

- గంగయ్య, కోనుప్పలపాడు

ఓటే వజ్రాయుధం

జాతీయ ఓటరు దినోత్సవంలో కలెక్టర్


అనంతపురం టౌన్ జనవరి 25: ప్రజాస్వామ్య దేశంలో ఓటే వజ్రాయుధమని, ప్రతి ఒక్కరూ నిష్పక్షపాతంగా, బాధ్యతగా ఓటు హక్కు వినియోగించుకోవాలని ఓటర్లకు కలెక్టరు గౌతమి సూచించారు. జాతీయ ఓటర్ల దినోత్సవం సందర్భంగా గురువారం కలెక్టరేట్‌లోని రెవెన్యూ భవన్‌లో నిర్వహించిన వేడుకలను కలెక్టర్ ప్రారంభించారు. అధికారులు, ఓటర్లతో ప్రతిజ్ఞ చేయించారు. అనంతరం కలెక్టరు మాట్లాడుతూ.. జిల్లాలో మొత్తం 19,94,544 మంది ఓటర్లు ఉన్నారని, ఇంకా కొత్తగా ఓటు నమోదుకు అవకాశముందని, ఇందుకోసం స్పెషల్ క్యాంపులు ఏర్పాటు చేసామని అన్నారు. త్వరలో ఓటు ఉన్న ప్రతి ఒక్కరికీ స్లిప్‌లు పంపిణీ చేస్తామన్నారు. మంచిగా పనిచేసిన అధికారులను సన్మానించారు. కార్యక్రమంలో నగరపాలక కమిషనర్ మేఘస్వరూప్, డీఆర్‌ఓ గాయిత్రీదేవి, ఆర్డీఓలు గ్రంది వెంకటేష్, రాణిసుష్మిత ఈఆర్‌ఓలు సుధారాణి, వెంకటేశ్వర్లు, వరప్రసాద్, వెంకటనారాయణమ్మ, ఐసీడీఎస్ పీడీ శ్రీదేవి, ఎన్నికల సెల్ అధికారులు భాస్కర్, కనకరాజు పాల్గొన్నారు.


అధికారులు, ఓటర్లతో ప్రతిజ్ఞ చేయిస్తున్న కలెక్టర్ గౌతమి


తప్పులు.. కుప్పలు తెప్పలు..!



● అనంతపురం రూరల్ మండలంలోని కొడిమి పంచాయతీ ప్రజాచైతన్య కాలనీలో కొన్నేళ్లుగా పోతులయ్య నివాసం ఉంటున్నాడు. గతంలో ఎన్‌డీఎఫ్ 1213354 నంబరుతో ఓటరుగా నమోదయ్యాడు. రెండు రోజుల కిందట విడుదలైన తుది జాబితాలో ఆయన పేరు మాయమైంది.



● రాచానపల్లి పంచాయతీ పరిధిలోని 50 పోలింగ్ కేంద్రం పరిధిలో దూదేకుల మహమ్మద్ పేరిట రెండు (ఎన్‌డీఎఫ్ 1765924, ఎన్‌డీఎఫ్ 1774827), హరికృష్ణ కుమ్మర పేరి రెండు (ఎన్‌డీఎఫ్ 2078434, ఎన్‌డీఎఫ్ 2122851) ఎంట్రీలు నమోదయ్యాయి. ఇలా చాలామందికి డబుల్ ఓట్లు వచ్చాయి. ముసాయిదాలోనూ వీరు డబుల్ ఎంట్రీలుగా ఉన్నారు. అయినా తొలగించలేదు.



● మన్నీల గ్రామంలో శోభరాణి అనే మహిళ పేరు గతంలో (ఎన్‌డీఎఫ్ 1545623) ఓటరు జాబితాలో ఉండేది. తుది జాబితాలో ఆమె పేరు మాయమైంది. ఆమె స్థానిక సర్పంచు భార్య కావడం గమనార్హం. ఇదే గ్రామానికి చెందిన ఎ.నారాయణ (ఎన్‌డీఎఫ్1850601), బి.ఆంజనేయులు(ఎన్‌డీఎఫ్1850676) ఏడాది క్రితం మృతిచెందారు. కానీ ఓటరు జాబితాలో అలాగే ఉంచారు. ఈ ఊరిలో సుమారు 50 వరకు మృతుల పేర్లు ఓటరు జాబితాలో ఉన్నట్లు సమాచారం.

తుది జాబితాలో మృతులు, డబుల్ ఎంట్రీలు

అనంత రూరల్‌లో అర్హుల పేర్లు మాయం
ఓటర్ల తుది జాబితాపై ఎన్నెన్నో అనుమానాలు

అనంతపురం రూరల్, జనవరి 25: ముసాయిదా జాబితాలో పొరపాట్లను సరిదిద్ది.. తుది జాబితాలను విడుదల చేయాల్సిన అధికారులు.. అదే నిర్లక్ష్యాన్ని కొనసాగించారు. డబులు ఎంట్రీలు, మృతుల పేర్లు జాబితాలో బోలెడన్ని కనిపిస్తున్నాయి. కొందరు స్థానికంగానే ఉన్నా, ముసాయిదా జాబితాలో పేరున్నా.. తుది జాబితా వచ్చేలోగా గల్లంతయ్యారు. అనంతపురం రూరల్ మండలంలో ఓటరు తుది జాబితా తయారైన తీరుపై తీవ్ర విమర్శలు వస్తున్నాయి. తొలగించాల్సినవి అలాగే ఉంచేసి.. పక్కాగా ఉన్నవాటిని తొలగించడం అనుమానాలకు తావిస్తోంది.

తొలగించింది కొన్నే..

ఓటర్ల తుది జాబితా ప్రకారం అనంతపురం రూరల్ మండలంలోని 21 పంచాయతీల పరిధిలో 79,962 మంది ఓటర్లు ఉన్నారు. ఇందులో మహిళలు 40,438, ఇతరులు ముగ్గురు ఉన్నారు. అంతకు మునుపు 83 వేల పైచిలుకు ఓటర్లు ఉండేవారు. ఓటరు జాబితా పరిశీలన సమయంలో మండలంలో పది వేలకు పైగా డబుల్ ఎంట్రీలు, రెండు వేలకు పైగా మృతుల పేర్లు ఉన్నట్లు గుర్తించారు. తాజా జాబితా నుంచి మూడు వేల వరకూ పేర్లను తొలగించారు. ఇందులో మృతులు, డబుల్ ఎంట్రీలతోపాటు అర్హులూ ఉన్నారు. దీన్ని బట్టి డబుల్ ఎంట్రీలు, మృతుల పేర్లు వేలాదిగా జాబితాలో ఇంకా ఉన్నాయన్నది స్పష్టమౌతోంది.



రాచానపల్లి పంచాయతీ 50 బూతులో ఉన్న డబుల్ ఓట్లు



మన్నీలలో మరణించినవారి ఓట్లు యథాతథం





చనిపోయిన వ్యక్తులను తుదిజాబితాలో ఓటరుగా ఉన్న దృశ్యం

చనిపోయినా ఓటర్లుగా నమోదు చేశారు..!

బొమ్మనహాళ్, జనవరి 25: తప్పులు లేని ఓటరు జాబితానే ప్రధాన లక్ష్యమని ఎన్నికల అధికారులు పదే పదే చెప్పుకొచ్చారు. అయినా తుది జాబితాలోనూ తప్పులు దొర్లాయి. చనిపోయినా ఓటరు లిస్టులో నుంచి తొలగించలేదు. బొమ్మనహాళ్ మండలం కానాపురం, ఏళంజి గ్రామాల్లో 76 బూత్‌లో వైసీపీ సర్పంచ్‌గా ఉన్న తిమ్మక్క పెన్నంపల్లి గత ఏడాది చనిపోయింది. అయినా ఓటరు లిస్టులో నుంచి తొలగించలేదు. అదేవిధంగా ఎల్‌బీనగర్ గ్రామంలో 85 బూత్‌లో బీ పాలాక్షిరెడ్డి మూడేళ్ల క్రితం చనిపోయాడు. తుది ఓటరు జాబితాలో అయనకు ఓటు ఉన్నట్లు చూపించారు. తప్పులు లేకుండా కొత్త ఓటరు జాబితా తయారు చేసేందుకు అధికారులు క్షేత్రస్థాయిలో పర్యటన చేశారా లేదా అన్న అనుమానం వ్యక్తమవుతున్నట్లు గ్రామస్థులు పేర్కొన్నారు.


ఇక్కడా అవకతవకలే

● ఓటర్ల లిస్టులో డబుల్ ఎంట్రీలు, వలస వెళ్లిన వారి పేర్లు అలాగే.. ● బీఎల్వోల నిర్లక్ష్యంతోనే ఇలా జరిగిందంటున్న ప్రతిపక్షాలు



జాబితాలో అలాగే ఉన్న షిఫ్టింగ్ ఓట్లు


ధర్మవరంరూరల్, జనవరి 25: ఓటర్ల తుది జాబితాలో కూడా అవకతవకలకు తావిచ్చారు. ఇంటింటా పకడ్బందీ సర్వే చేసి డబుల్ ఓట్లు, షిఫ్టింగ్ ఓట్లును తొలగించి తప్పుల్లేని జాబితా ఇవ్వాలని బీఎల్వోలకు అధికారులు గట్టి ఆదేశాలు ఇచ్చారు. అయినా తుది జాబితాలో మళ్లీ తప్పులే వచ్చాయి. వాటిలో కొన్నింటిని పరిశీలిస్తే ధర్మవరం పట్టణంలోని గుట్టకిందపల్లిలో 264పోలింగ్ కేంద్రం సీరియల్ నెంబర్ 113లో మేకల ప్రియవర్ధన్ ఓటు ఉంది. అయితే అదేబూత్‌లో 22వ సీరియల్ నెంబర్‌లోనూ మేకలప్రియవర్ధన్ పేరు వచ్చింది. దీంతో డబుల్‌ఎంట్రీగా నమోదైంది. అదేవిధంగా పూజిత బుర్ర అనే మహిళ ఓటు 262వ పోలింగ్‌కేంద్రంలోని 1488వ సీరియల్ నంబర్‌లో ఉంది. మళ్లీ అదేబూత్‌లోని 1486వ సీరియల్ నెంబర్‌లో ఆమె పేరు కనిపించింది. అంతేకాకుండా పట్టణంలోని తారకరామాపురంలో నివాసం ఉండే గొట్లూరు వరలక్ష్మీ, గొట్లూరు హర్షవర్ధన్‌రెడ్డి, రాజశేఖర్‌రెడ్డిల ఓట్లు 1486వ పోలీస్‌కేంద్రంలోని 1231, 1232, 1233వ సీరియళ్ల నంబర్లలో ఉన్నాయి. వారంతా నాలుగేళ్ల క్రితం మరోచోట అయిన గీతామందిరానికి వలస వెళ్లారు. వారి ఓట్లు మాత్రం అక్కడికి షిఫ్టింగ్ కాలేదు. ఇలా డబుల్ ఓట్లు, సిఫ్టింగ్ ఓట్లు అలాగే ఉంచడంతో ప్రతిపక్షాల నాయకులు బీఎల్వోలపై మండిపడుతున్నారు. వారు నిర్లక్ష్యంతోనే ఇలా జరిందంటూ ఆరోపిస్తున్నారు.



ముదిగుబ్బ మండలం ఎనుములవారిపల్లిలో మృతి చెందిన వ్యక్తి ఓటును తొలగించని దృశ్యం

ముదిగుబ్బ: మండలంలోని ఎనుములవారిపల్లిలో ఓటర్ల తుదిజాబితా తప్పుల తడకగానే ప్రచురితమైంది. మలకవేముల పంచాయతీ ఎనుములవారిపల్లి పోలింగ్ కేంద్రం 80లో వెంకటరామన్న గత మూడు నెలల క్రితం మృతి చెందారు. ఈ విషయం స్థానిక నాయకులు.. బీఎల్వోలకు సమాచారం ఇచ్చారు. అయినా ఓటరుజాబితాలో అతడి పేరు తొలగించలేదు. అదే గ్రామంలో అరవేటి శ్వేత పేరుతో డబుల్ ఎంట్రీ ఉన్నాయి. ఓటర్ల తుది జాబితా తప్పుల తడకగా రావడంపై బీఎల్వోల నిర్లక్ష్యమేనని ప్రతిపక్ష పార్టీలనాయకులు పేర్కొంటున్నారు. మృతి చెందిన వారి ఓట్లు, డబుల్ ఎంట్రీలను తొలగించలేదని ఆరోపిస్తున్నారు.

ఆత్మలు ఎలా ఓటు వేస్తాయో!



మృతిచెందినా ఓటరు జాబితాలో ఉన్న పేర్లు

పదేళ్ల క్రితమే విదేశాలకు వెళ్లినా ఇప్పటికీ జాబితాలో ఉన్న దృశ్యం

3 నెలలు కసరత్తు చేసినా తొలగని పేర్లు

హిందూపురం, జనవరి 25 : ఓటర్ల జాబితాలో తప్పులున్నాయని ఆరు నెలలుగా ప్రతిపక్షాలు కోడై కూస్తున్నాయి. జాబితాలో తప్పులు చాలా ఉన్నాయని నెత్తినోరు బాదుకున్నా క్షేత్రస్థాయిలో అధికారులు పట్టించుకోలేదు. దాని ఫలితంగా ఐదారేళ్ల క్రితం చనిపోయిన వారి పేర్లు, పదేళ్ల క్రితం దేశం విడిచి వెళ్లి విదేశాల్లో స్థిరపడివారి పేర్లు జాబితాలో పదిలంగా ఉన్నాయి. దీనిని బట్టిచూస్తే అధికారులు తప్పొప్పులు ఎలా సరిచేశారో ఇట్టే అర్థమవుతుంది. హిందూపురంలో మృతులకు మరోసారి జాబితాలో చోటు కల్పించారు. వారు మృతులని క్షేత్రస్థాయిలో అధికారులకు సమాచారం అందించినా పట్టనట్లు వ్యవహరించి ఓటర్ల జాబితాను తప్పుల తడకగా మార్చారు. హిందూపురం పట్టణంలో ప్రతి వార్డులో కనీసం 20 నుంచి 30 మంది మృతిచెందినవారు ఓటర్ల జాబితాలో ఉండటం విశేషం. మూడు నెలలుగా మృతిచెందిన వారి పేర్లు తొలగించాలని అధికారులకు దరఖాస్తు చేసినా, పరిశీలించి పేర్లు మాత్రం తొలగించలేదు.

మృతిచెందిన వారి ఓట్లు అలాగే..

పట్టణంలోని తిప్పరాజు, ప్రమీళమ్మ నాలుగేళ్ల క్రితం మృతిచెందారు. కానీ నేటికీ వారి పేర్లు జాబితాలో ఉన్నాయి. రంగనాథ ప్రసాద్ అనే ఓటరు మూడేళ్ల క్రితమే చనిపోయాడు. అయినా ఇప్పటికీ అలాగే ఉంది. అదేవిధంగా బెంగళూరు రోడ్డులో నివాసముంటున్న గంగలక్ష్మి, లీలావతమ్మలు కూడా చనిపోయారు. శ్రీనివాసరావు, కస్తూరీబాయి దంపతులు పదేళ్ల క్రితమే ఇతర దేశంలో స్థిరపడ్డారు. అయినా వారి పేర్లు ఇప్పటికే ఓటరు జాబితాలో ఉండటం అధికారుల పనితీరుకు అద్దం పడుతోంది. ఎన్నికల సంఘం నిబంధనల మేరకు ఆధారాలు ఇవ్వని వారి ఓట్లు తొలగించడానికి వీలులేదన్నారు. అయినా కొంతమంది అర్హులు ఉంటే తొలగించడం మరో విశేషం.

3 నెలలు కసరత్తు.. చేసిందేమిటి?

ఓటరు జాబితాలో తప్పొప్పులను సరిదిద్దేందుకు 3 నెలల పాటు కసరత్తు చేశారు. అయినా ఓటరు జాబితా మాత్రం తప్పుల తడకగానే ఉంచారు తప్ప అందులో ఎలాంటి మార్పులు చేయకపోవడం దురదృష్టకరం. మూడు నెలల్లో బీఎల్‌ఓలు ఏ ఇంటికి ఏ తప్పు సరిచేశారో ఇప్పటికీ చెప్పకపోవడం మరో వింత. తప్పనిసరిగా మృతిచెందిన వారి ఓట్లు తొలగించాలని అర్హత ఉన్నవారివి ఒకసారి జాబితాలో లేకపోతే వారిని చేర్చాలన్నా క్షేత్రస్థాయిలో అవి పట్టించుకోకపోవడంతో ఓటర్ల జాబితా తప్పుల తడకగా తుదిజాబితా విడుదల చేశారు.

వెయ్యి దాకా మృతుల ఓట్లు

హిందూపురం పట్టణంలోని 38 వార్డుల్లో వెయ్యి దాకా మృతిచెందిన వారి ఓట్లు తుది జాబితాలో వచ్చినట్లు తెలుస్తోంది. మూడు నెలల క్రితం మృతిచెందిన వారి ఓట్లు తొలగించాలని సుమారు ఐదారు వందల మంది దరఖాస్తు చేసుకున్నా అధికారులు మాత్రం దరఖాస్తులు స్వీకరించారుతప్ప ఓట్లు తొలగించలేదు. దీనిని బట్టి అధికారుల పనితీరు ఎలా ఉందో అర్థమవుతోంది.

ఉమ్మడి జిల్లాలో పలువురు సీఐల బదిలీ

పుట్టపర్తిరూరల్, జనవరి 25: ఉమ్మడి జిల్లాలో పలువురు సీఐలను బదిలీ చేస్తూ అనంతపురం రేంజ్ డీఐజీ ఆర్ఎన్ అమ్మిరెడ్డి గురువారం ఉత్తర్వులు జారీ చేశారు. ఇందులో భాగంగా శ్రీసత్యసాయిజిల్లా పోలీసుకార్యాలయంలో వీఆర్‌లో ఉన్న పీ. రాజారమేష్‌ను కొత్తచెరువు యూపీఎస్‌కు, కదిరి అర్బన్ పోలీసుస్టేషన్‌లో విధులు నిర్వర్తిస్తున్న డీవీ నారాయణరెడ్డిని అనంతపురం ట్రాఫిక్ పోలీస్‌స్టేషన్‌కు, అనంతపురం ట్రాఫిక్ పోలీస్‌స్టేషన్‌లో ఉన్న సీ.వెంకటేష్ నాయక్‌ను సీసీఎస్ అనంతపురానికి, శ్రీసత్యసాయిజిల్లా పోలీసుకార్యాలయంలో వీఆర్‌లో ఉన్న జే.హేమంత్ కుమార్‌ను సోషల్ మీడియా, సైబర్‌క్రైం సెల్‌కు బదిలీ చేస్తూ డీఐజీ ఉత్తర్వులు జారీ చేశారు.

శ్రీ సత్యసాయి జిల్లాలో భారీగా ఎస్ఐల బదిలీ

సార్వత్రిక ఎన్నికల నేపథ్యంలో కేంద్రఎన్నికల కమిషన్ ఆదేశాల మేరకు శ్రీసత్యసాయి జిల్లాలో భారీగా ఎస్ఐలను బదిలీ చేస్తూ అనంతపురం రేంజ్ డీఐజీ ఆర్ఎన్ అమ్మిరెడ్డి గురువారం ఉత్తర్వులు జారీ చేశారు. ఇందులో భాగంగా రామగిరి పోలీస్ స్టేషన్‌లో విధులు నిర్వర్తిస్తున్న జనార్దన్ నాయుడును జిల్లాకేంద్రంలోని పోలీసుకార్యాలయం సీసీఎస్‌కు, కియ పోలీసుస్టేషన్ నుంచి రమేష్‌బాబును నల్లమాడ స్టేషన్‌కు, బుక్కపట్నం స్టేషన్ నుంచి కే నరసింహుడును పట్నం పోలీసు స్టేషన్‌కు, చెన్నేకొత్తపల్లి స్టేషన్ నుంచి శ్రీధర్‌ను నంబులపూలకుంట స్టేషన్‌కు బదిలీ చేశారు. అలాగే సీసీఎస్ పుట్టపర్తి పోలీసు స్టేషన్ నుంచి వెంకటరమణయ్యను హిందూపురం టూటౌన్‌కు, ఓబుళదేవరచెరువు స్టేషన్ నుంచి మల్లికార్జునరెడ్డిని కనగానిపల్లి స్టేషన్‌కు, గోరంట్ల అర్బన్ స్టేషన్ నుంచి ఇస్మాయిల్‌ఖాన్‌ను జిల్లా వీఆర్‌కు బదిలీ చేశారు. సీసీఎస్ నుంచి నారాయణను జిల్లా స్పెషల్‌బ్రాంచ్‌కు, కదిరి స్టేషన్ నుంచి వెంకట బసయ్యను జిల్లా పోలీసుకార్యాలయ పీసీఆర్‌కు, నంబులపూలకుంట స్టేషన్ నుంచి వెంకటరమణను జిల్లాపోలీసుకార్యాలయ వీఆర్‌కు, కదిరి పట్టణ స్టేషన్ నుంచి మక్బూల్‌బాషాను జిల్లాపోలీసుకార్యాలయం వీఆర్‌కు, హిందూపురం వన్ టౌన్ స్టేషన్ నుంచి భాస్కర్‌ప్రసాద్‌రాజును జిల్లాపోలీసు కార్యాలయ వీఆర్‌కు బదిలీ చేస్తూ డీఐజీ ఉత్తర్వులు జారీ చేశారు.

ఎంసీఏ పరీక్షా ఫలితాలు విడుదల

అనంతపురం సెంట్రల్, జనవరి 25: జేఎన్‌టీయూ ఇంజనీరింగ్ కళాశాల ఎంసీఏ విద్యార్థుల పరీక్షల ఫలితాలను ప్రిన్సిపాల్ సత్యనారాయణ గురువారం విడుదల చేశారు. ద్వితీయ సంవత్సరం ప్రథమ సెమిస్టర్ (ఆర్20) రెగ్యులర్ పరీక్షలు 22న ముగిశాయన్నారు. త్వరతగతిన మూల్యాంకణ ప్రక్రియను పూర్తిచేసి ఫలితాలను విడుదల చేశామన్నారు. విద్యార్థులు వారి ఫలితాల కోసం కళాశాలలోని అకడమిక్ సెక్షన్‌ను సంప్రదించాలన్నారు.

చేపల కూర వండే విషయమై తగాదా..
అన్నను హతమార్చిన తమ్ముడు



సంజీవులు (ఫైల్)

తనకల్లు, జనవరి 25: చేపల కూర వండే విషయమై తలెత్తిన తగాదాతో సొంత అన్నను తమ్ముడే హత్య చేశాడు. మండలంలోని నడింకుంటపల్లిలో బుధవారం రాత్రి సంజీవులు (30)ను సొంత తమ్ముడు వెంకటేష్ మందంపాటి చెక్కతో బాది, హత్య చేశాడు. ఇన్‌చార్జి ఎస్ఐ లింగన్న తెలిపిన వివరాల మేరకు.. సంజీవులు, వెంకటేష్ కుటుంబాలు కలిసే ఉండేవి. బుధవారం సాయంత్రం సంజీవులు గ్రామ సమీపాన ఉన్న చెరువులో చేపలు పట్టి, తీసుకొచ్చాడు. భార్య హేమలత ఊరికెళ్లడంతో తమ్ముడి వెంకటేష్ భార్య పవిత్రకు చేపల కూర చేయాలని చెప్పాడు. రాత్రి పొద్దుపోయిందనీ, గురువారం వండి ఇస్తానని ఆమె చెప్పింది. అప్పటికే మద్యం మత్తులో ఉన్న సంజీవులు.. తనకు చేపలకూర కావాలని పట్టుబట్టాడు. మసాలా తయారు చేసి ఇస్తే, తానే వండుకుంటానన్నాడు. దీంతో ఆమె మసాలా తయారు చేసి, ఇచ్చింది. చేపలకూర వండుకుంటూ సంజీవులు.. తమ్ముడు వెంకటేష్‌ను నానా దుర్భాషలాడసాగాడు. మిద్దెపైపడుకున్న వెంకటేష్ ఆ మాటలు విని ఆగ్రహంతో రాత్రి 10గంటల సమయంలో ఇంట్లోకి వచ్చాడు. చేతికి దొరికిన మందంపాటి చెక్కతో అన్న తలపై బాదాడు. దీంతో సంజీవులు అక్కడికక్కడే మృతిచెందారు. విషయం బయటకు పొక్కకుండా వెంకటేష్ మిన్నకుండిపోయాడు. నానమ్మ వచ్చి సంజీవులు ఏడని తలుపు తీసి చూడగా, రక్తపు మడుగులో మృతిచెంది పడి ఉండడాన్ని చూసి బోరున విలపించింది. పోలీసులకు సమాచారం అందించారు. కదిరి రూరల్ సీఐ వెంకటేశ్వర్లు, తనకల్లు ఇన్‌చార్జీ ఎస్ఐ లింగన్న హత్యాస్థలాన్ని పరిశీలించారు. సంజీవులు అత్త నరసమ్మ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేశారు. మృతదేహాన్ని కదిరి ప్రభుత్వాస్పత్రికి తరలించారు. సంజీవులుకు సంతానం లేదు.

గుర్తు తెలియని మృతదేహం లభ్యం

అనంతపురం క్రైం, జనవరి 25: స్థానిక బళ్లారి బైపాస్‌లోని సర్వీస్‌రోడ్డు పక్కన ఉన్న వైన్‌షాపు ఎదుట ఓ గుర్తు తెలియని వృద్ధుడి మృతదేహాన్ని నాలుగో పట్టణ పోలీసులు గురువారం రాత్రి స్వాధీనం చేసుకున్నారు. అనారోగ్యంతో అతను మరణించినట్లు పోలీసులు భావిస్తున్నారు. ఆ వ్యక్తి ఆచూకీ తెలిసిన వారు 9346010581, 9346917088ను సంప్రదించాలని సూచించారు.

ప్రేమ.. పెళ్లి.. చావు..!




అభిషేక్ (ఫైల్)




ఉమ్మడి జిల్లాలో మూడు ఆత్మహత్యలు

మనిషి జీవితం వందేళ్లు..! బాల్యం మొదలు వృద్ధాప్యం వరకూ ఎన్నెన్నో అనుభవాలు ఎదురవుతాయి. కొన్ని మోదం.. మరికొన్ని ఖేదం..! అవన్నీ జీవితంలో భాగమే. అవే జీవితం కాదు..! అన్నింటినీ ఎదుర్కొంటూ ముందుకు సాగాలి. ఆ క్షణంలో ఎదురైన కష్టం జీవితాంతం ఉంటుందని కొందరు అనుకుంటారు. కానీ కాలం అన్ని కష్టాలనూ గట్టెక్కిస్తుందని, గాయాలను మాన్పిస్తుందని, మునుముందు రెట్టింపు ఆనందం ఎదురు చూస్తుంటుందని తెలియదు వారికి. అలాంటివారు క్షణికావేశంలో అర్ధంతరంగా తనువు చాలిస్తుంటారు. బలవన్మరణం దేనికీ పరిష్కారం కాదు..! ప్రేమ.. పెళ్లి విషయంలో ఎదురైన చేదు అనుభవాలను ఎదుర్కొనలేక ఉమ్మడి జిల్లాలో గురువారం ముగ్గురు ఉసురు తీసుకున్నారు. తల్లిదండ్రులకు జీవితకాలపు శిక్షను విధించారు.



కుందుర్పి మండలం కరిగానపల్లి గ్రామానికి చెందిన సోమనాథ్, రుక్మిణి దంపతుల కుమారుడు అభిషేక్(17) కళ్యాణదుర్గం బోరంపల్లిలో పాలిటెక్నిక్ మొదటి సంవత్సరం విద్యార్థి. ఒక అమ్మాయిని ప్రేమించాడు. ఆమెతో పెళ్లి చేయాలని తల్లిదండ్రులను కోరాడు. 'అప్పుడే పెళ్లేమిటి? బాగా చదువుకో.. మంచి ఉద్యోగం సంపాదించుకో.. అప్పుడు చూద్దాం..' అన్నారు తల్లిదండ్రులు. ఈ విషయమై నాలుగు రోజుల క్రితం తల్లిదండ్రులు అభిషేక్‌కు నచ్చజెప్పారు. బాగా చదువుకుని, మంచి ఉద్యోగం తెచ్చుకుని.. జీవితంలో స్థిరపడితే తల్లిదండ్రులు కొడుకు ప్రేమను ఎందుకు కాదంటారు..? కానీ ఆ దిశగా ఆలోచించలేదు కొడుకు. తన ప్రేమ ఎక్కడ దూరమవుతుందోనని ఆందోళన చెందాడు. కాలేజీకి వెళ్లొచ్చిన తరువాత బుధవారం సాయంత్రం తల్లిదండ్రులతో కాసేపు మాట్లాడాడు. ఆ తరువాత సెల్‌ఫోన్‌ను తల్లికి ఇచ్చి, బైక్‌పై బయటకు వెళ్లిపోయాడు. రాత్రికి ఇంటికి కాలేదు. స్నేహితులతో ఎక్కడైనా ఉంటాడని అనుకున్నారు. పంటకు నీరు పెట్టేందుకుఒ గురువారం ఉదయం సోమనాథ్ పొలానికి వెళ్లాడు. అక్కడ చింత చెట్టుకు ఉరివేసుకున్న కుమారుడు కనిపించాడు. 'ఏమి తక్కువ చేశాం నాయనా.. ఇంత పనిచేశావు..' అని తల్లిదండ్రులు గుండెలు పగిలేలా ఏడ్చారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని ఎస్ఐ వెంకటస్వామి తెలిపారు. **- కుందుర్పి**

పెళ్లి కాలేదని..



ఆత్మహత్య చేసుకున్న నవీన్

సోమందేపల్లి మండలం మండ్లి గ్రామానికి చెందిన నవీన్ (20) గురువారం ఉరివేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. కియ అనుబంధ పరిశ్రమలో నవీన్ కార్మికుడు. ఇతనికి ఆరోగ్యం సరిగాలేదని, దీనికి తోడు పెళ్లికాలేదని మనోవేదన చెందేవాడని ఎస్ఐ విజయ్‌కుమార్ తెలిపారు. ఈ క్రమంలో తన ఇంట్లో ఫ్యాన్‌కు ఉరివేసుకున్నాడని తెలిపారు. మృతదేహాన్ని పెనుకొండ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. **- పెనుకొండ టౌన్**

బాలికా వధు

అనంతపురం నగరంలోని బసవతారక నగర్‌కు చెందిన హారిక వయసు పద్నాలుగేళ్లు. ఇంత చిన్న వయసులో, అదే కాలనీకి చెందిన కిరణ్ అనే యువకుడిని ప్రేమించింది. తల్లిదండ్రులను ఎదిరించి పెళ్లి చేసుకుంది. దీంతో తల్లిదండ్రులు హారికను దూరం పెట్టారు. ఇది జరిగి కేవలం నాలుగు నెలలు అయ్యింది. అదే కాలనీలో కాపురం పెట్టారు. క్లీనర్ పనిచేసే కిరణ్ తాగుడుకు బానిస అయ్యాడు. రోజూ హారికతో గొడవపడేవాడు. తన జీవితం ఇలా అయ్యిందేమిటని ఆ బాలిక బుధవారం రాత్రి తన ఇంట్లో ఫ్యాన్‌కు ఉరివేసుకుంది. బాల్య వివాహం నేరం. హారిక విషయంలో తల్లిదండ్రులు చట్టబద్ధంగా వెళ్లినా కాపాడుకోగలిగేవారు. తప్పు జరిగిపోయింది. తన కష్టం ఇదీ.. అని తల్లిదండ్రులను ఆశ్రయించా ఆమె బతికేది. భవిష్యత్తు మరోలా ఉండేది. హారికది సాంకేతికంగా ఆత్మహత్యే అయినా.. ఆ పరిస్థితులకు కారణమైనవారు ఆమెను బలిగొన్నట్లే కదా..! **- అనంతపురంక్రైం**

రైలుకిందపడి గుర్తుతెలియని వ్యక్తి మృతి

ధర్మవరం, జనవరి 25: పట్టణంలోని రైల్వేస్టేషన్ సమీపంలో సోలాపూర్ ఎక్స్‌ప్రెస్ రైలు కింద పడి గుర్తుతెలియనివ్యక్తి మృతి చెందినట్లు రైల్వే జీఆర్‌పీ ఎస్ఐ గోపీకుమార్ తెలిపారు. మృతదేహాన్ని పరిశీలించి ఇతను ఆత్మహత్యకు పాల్పడినట్లుగా తెలుస్తోందన్నారు. మృతుడికి 45 నుంచి 50 ఏళ్ల మధ్య వయసు ఉంటుందన్నారు. స్కైబ్లూరంగు షర్టు ధరించి ఉన్నాడన్నారు. కేసు నమోదు చేసుకున్నట్టు ఎస్ఐ చెప్పారు. మృతుడిని గుర్తు పట్టిన వారు 9440627640, 9440552808 , 08559-226333కు ఫోన్ చేయాలని ఆయన సూచించారు.

మరో ముగ్గురిపై వేటు

ధర్మవరం భూబాగోతంలో ఇద్దరు వీఆర్వోలు, వీఆర్‌ఏ సస్పెన్షన్..

ఇదివరకే ఇన్‌చార్జి తహసీల్దార్‌పై చర్యలు


ధర్మవరం, జనవరి 25: ధర్మవరం పరిధిలో భూఅక్రమాల వ్యవహారంలో మరో ముగ్గురు రెవెన్యూ సిబ్బందిపై వేటు పడింది. ఇప్పటికే భూబాగోతంలో బత్తలపల్లి తహసీల్దార్, ధర్మవరం ఇన్‌చార్జిగా కూడా వ్యవహరిస్తున్న యుగేశ్వరీదేవిని సస్పెండ్ చేస్తూ కలెక్టర్ అరుణ్‌బాబు బుధవారం ఉత్తర్వులు జారీ చేసిన విషయం తెలిసిందే. అక్రమాలపై లోతుగా విచారణ చేసిన అధికారులు ఇద్దరు వీఆర్వోలు, వీఆర్‌ఏ పాత్ర కూడా ఉందని తేల్చి, వారిని కూడా సస్పెండ్ చేశారు. సస్పెండైన వారిలో ధర్మవరం మండలం గొట్లూరు వీఆర్వో నజీర్, పోతుకుంట వీఆర్వో వెంకట్రామిరెడ్డి, కట్టకిందపల్లి వీఆర్‌ఏ నారాయణస్వామి ఉన్నట్లు రెవెన్యూవర్గాల ద్వారా తెలిసింది. పోతుకుంట వీఆర్వో వెంకటరామిరెడ్డి.. కుణుతూరు ఇన్‌చార్జిగా ఉంటూ పోతుకుంట, కుణుతూరులో ఇళ్లపట్టాలు, భూపంపిణీ, మ్యుటేషన్‌లో అవకతవకలకు పాల్పడినట్లు ఆరోపణలు వచ్చాయి. ఈ నేపథ్యంలోనే సస్పెండ్ చేసినట్లు తెలిసింది. గొట్లూరు వీఆర్వో నజీర్.. ధర్మవరం పట్టణ ఇన్‌చార్జిగా వ్యవహరిస్తూ భారీఎత్తున అవకతవకలకు పాల్పడినట్లు కలెక్టరేట్‌కు ఫిర్యాదులు అందడంతో ఆయనపై కూడా చర్యలు తీసుకున్నట్లు సమాచారం. వీరికి సహకరించిన కట్టకిందపల్లి వీఆర్‌ఏ నారాయణస్వామిని కూడా సస్పెండ్ చేసినట్లు అధికార వర్గాల ద్వారా తెలిసింది. వీరంతా కలిసి అక్రమాలకు పాల్పడడం గమనార్హం. ఈ విషయంపై ఆర్డీఓ రమేశ్‌రెడ్డిని అడగ్గా.. సస్పెన్షన్ ఉత్తర్వులు అందాయనీ, పరిశీలించి చెబుతానంటూ దాటవేశారు.

ఒక పశ్నపత్రం బదులు మరొకటి..!

అయోమయంలో పడిన విద్యార్థులు
ఖంగుతిన్న ఇన్విజిలేటర్
తప్పు సరిదిద్దుకున్న యూనివర్శిటీ విభాగం
గంట ఆలస్యంగా ప్రారంభమైన పరీక్ష

తాడిపత్రి, జనవరి 25: పట్టణ సమీపంలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో గురువారం జరిగిన ఎస్కే యూనివర్సిటీ బీఈడీ మొదటి సంవత్సరం సెమ్ -2 పరీక్ష నిర్వహించారు. ఈ పరీక్షకు 300మంది విద్యార్థులు హాజరయ్యారు. రెండవ సెమ్‌లో మూడవ పరీక్ష అయిన క్లాస్‌రూం మేనేజ్‌మెంట్ ప్రశ్నపత్రానికి బదులు బుధవారం జరిగిన లెర్నింగ్ అండ్ టీచింగ్ ప్రశ్నపత్రాన్ని విద్యార్థులకు అందజేశారు. ముందురోజే ఈ పరీక్ష పత్రం రాసి ఉండడంతో ఖంగుతిన్న విద్యార్థులు జరిగిన పొరపాటును ఇన్విజిలేటర్ దృష్టికి తీసుకువెళ్లారు. ఆశ్చర్యపోయిన ఇన్విజిలేటర్ ప్రశ్నపత్రాన్ని పరీక్ష నిర్వాహక సిబ్బంది దృష్టికి తీసుకువెళ్లారు. ప్రిన్సిపాల్ యూనివర్సిటీ అధికారికి ఫోన్‌చేసి జరిగిన పొరపాటును వివరించారు. వారు వెంటనే క్లాసరూం మేనేజ్‌మెంట్ ప్రశ్నపత్రాన్ని వాట్సాప్ ద్వారా ప్రిన్సిపాల్‌కు పంపగా జిరాక్స్ చేసి విద్యార్థులకు అందించారు. ఉదయం 10గంటలకు జరగాల్సిన పరీక్ష 11గంటలకు ప్రారంభమైంది.

ఉత్తమ కార్యదర్శి.. కర్ణాటక మద్యంతో దొరికాడు..!





కర్ణాటక నుంచి అక్రమంగా మద్యాన్ని తెస్తూ.. చిలమత్తూరు గ్రామ పంచాయతీ కార్యదర్శి మధుసూదన్ సెబ్ పోలీసులకు పట్టుబడ్డారు. కొడికొండ చెక్‌పోస్టు వద్ద వాహనాలను తనిఖీ చేస్తుండగా ఆయన దొరికిపోయారని సెబ్ సీఐ రాజశేఖర్ తెలిపారు. తన వాహనంలో పెద్ద ఎత్తున కర్ణాటక మద్యాన్ని తీసుకువచ్చారని, వాహనాన్ని సీజ్ చేసి హిందూపురం సెబ్ స్టేషన్‌కు తరలించామని ఆయన తెలిపారు. కాగా, గణతంత్ర దినోత్సవం సందర్భంగా ఇచ్చే ఉత్తమ పురస్కారానికి మధుసూదన్ ఎంపికయ్యారు. పురస్కార గ్రహీతల జాబితాలో ఆయన నంబరు 332. గణతంత్ర దినోత్సవాల సందర్భంగా శుక్రవారం మద్యం దుకాణాలను మూసివేస్తారు. ఈ నేపథ్యంలో ఆయన సెలబ్రేట్ చేసుకునేందుకు ముందుగానే మద్యం తెచ్చారా..? లేక ఈ దందా నడిపిస్తున్నారా..? అన్న చర్చ జరుగుతోంది. **- చిలమత్తూరు**



వ్రతం నిర్వహిస్తున్న పండితులు

భక్తిశ్రద్ధలతో సత్యనారాయణ వ్రతాలు

అనంతపురం కల్చరల్, జనవరి 25: పుష్యమాస పౌర్ణమిని పురస్కరించుకుని గురువారం నగరంలోని పలు ఆలయాల్లో సత్యనారాయణస్వామి వ్రతాలను భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. స్థానిక బెంగుళూరు రోడ్డులోని శివకోటి దేవాలయంలో అప్పాస్వామి ఈ వ్రతాన్ని నిర్వహించారు. అదేవిధంగా మూడో రోడ్డులోని షిర్డిసాయిబాబా ఆలయం, అశోక్‌నగర్ సత్యనారాయణస్వామి ఆలయం తదితర ఆలయాల్లోనూ సామూహిక సత్యనారాయణస్వామి వ్రతాలను నిర్వహించారు.

పంట విక్రయానికి నమోదు చేసుకోండి

శింగనమల, జనవరి 25: పంటలు గిట్టుబాటు ధరకు విక్రయించేందుకు స్థానిక రైతు భరోసా కేంద్రాల్లో రైతులు పేర్లను నమోదు చేసుకోవాలని ఏఓ అన్వేష్ కుమార్ ఒక ప్రకటనలో తెలిపారు. కందులు క్వింటా రూ.9,730, పత్తి రూ7,020, జొన్నలు 3,225తో ప్రభుత్వం కొనుగోలు చేస్తుందన్నారు.

11న మాదిగల ఆత్మీయ కలయిక

అనంతపురం రూరల్, జనవరి 25: అనంతపురంరూరల్ మండల సోములదొడ్డి గ్రామంలో వచ్చే నెల 11న ఉమ్మడి జిల్లా మాదిగల ఆత్మీయ కలయికను నిర్వహిస్తున్నామని, దాన్ని విజయవంతం చేయాలని ఎమ్మార్పీఎస్ నాయకులు కోరారు. గురువారం స్థానిక జడ్పీ కార్యాలయం ఎదుట ఉన్న డా బీఆర్. అంబేడ్కర్ విగ్రహం వద్ద ఆ నాయకులు నివాళులర్పించారు. ఆత్మీయ కలయికకు సంబంధించిన పోస్టర్‌ను విడుదల చేశారు. కార్యక్రమంలో బండారు హనుమంతు, ఆర్‌వీఎఫ్ రామచంద్ర, చిన్నపెద్దన్న, తిరుపాలు, రామాంజినేయులు, రమణ, ఓబులేసు, కుళ్లాయప్ప, చిన్న ఓబులేసు పాల్గొన్నారు.

సమగ్రశిక్ష సూపరింటెండెంట్‌గా ప్రదీప్

అనంతపురం విద్య, జనవరి 25: అనంతపురం జిల్లా విద్యాశాఖ కార్యాలయంలో సీనియర్ అసిస్టెంట్ ప్రదీప్‌కు సమగ్రశిక్ష ప్రాజెక్టు సూపరింటెండెంట్‌గా ఉద్యోగోన్నతి కల్పిస్తూ కడప ఆర్‌జేడీ వెంకట క్రిష్ణారెడ్డి ఉత్తర్వులు జారీ చేశారు. ఆ మేరకు గురువారం సాయంత్రం ఆయన బాధ్యతలు స్వీకరించారు. ఇక్కడ సూపరింటెండెంట్ సునీల్ ఇటీవలే నంద్యాల డీఈఓ కార్యాలయానికి బదిలీ అయిన విషయం తెలిసిందే.

అక్రమంగా సుంకం వసూలు

అనంతపురం రూరల్, జనవరి 25: మండలంలోని రాజీవ్ కాలనీ పంచాయతీ పరిధిలోని గోడౌన్‌లలో అక్రమంగా సుంకం వసూలు చేస్తున్న వారిపై చర్యలు తీసుకోవాలని ఆ కాలనీ వాసులు కోరారు. ఆ మేరకు గురువారం జిల్లా పంచాయతీ అధికారి ప్రభాకర్‌ను కలసి వినతి పత్రం ఇచ్చారు. పంచాయతీ పరిధిలోని గోదాములకు వచ్చి వెళ్లే వాహనాలకు సుంకం వసూలు చేయరాదని హైకోర్టు ఉత్తర్వులు ఇచ్చిందన్నారు. అయినా వెంకటరెడ్డి అనే వ్యక్తి అక్రమంగా సుంకం వసూలు చేస్తున్నారన్నారు. ఈ విషయంపై పంచాయతీ అధికారులకు ఫిర్యాదు చేసినా పట్టించుకోవడం లేదన్నారు. ఈ కార్యక్రమంలో పంచాయితీ వాసులు, టీడీపీ రాజీవ్‌కాలనీ కన్వీనర్ అశోక్‌కుమార్, ధనుంజయ, అశోక్, వెంకటేష్, అమ్ము పాల్గొన్నారు.

టెన్త్ విద్యార్థుల పీహెచ్ సర్టిఫికెట్ల పరిశీలన

అనంతపురం విద్య, జనవరి 25 : పదో తరగతి పరీక్షల నేపథ్యంలో టెన్త్ విద్యార్థుల పీహెచ్ సర్టిఫికెట్ల స్ర్కూటినీ పకడ్బందీగా నిర్వహించారు. ఏసీ గోవింద్‌నాయక్ ఆధ్వర్యంలో పాత డీఈఓ కార్యాలయంలో మండల విద్యాశాఖాధికారులు -2, ప్రధానోపాధ్యాయులు ఉదయం నుంచి సాయంత్రం వరకూ స్ర్కూటినీ చేశారు. ఏసీ మాట్లాడుతూ... ఈ ఏడాది జరిగే పదో తరగతి పరీక్షలకు జిల్లావ్యాప్తంగా 264 మంది విద్యార్థులు పీహెచ్ కేటగిరీలో సర్టిఫికెట్లు దరఖాస్తు చేశారన్నారు. గురువారం 251 మంది సర్టిఫికెట పరిశీలించామని, మిగిలిన వాటిని శుక్రవారం పూర్తి చేస్తామని ఆయన స్పష్టం చేశారు.

ప్రభుత్వ స్థలాన్ని కాపాడండి

రామగిరి, జనవరి 25: మండలంలోని దుబ్బార్లపల్లి కాలనీలో ఉన్న ప్రభుత్వ స్థలాన్ని అన్యాక్రాంతం కాకుండా కాపాడాలని టీడీపీ నాయకులు వీఆర్‌ఓ మంజునాథ్‌ను విజ్ఞప్తి చేశారు. ఈ మేరకు గురువారం ఆయనకు వినతిపత్రం అందజేశారు. కాలనీ వద్ద ఉన్న ఆ స్థలాన్ని అధికార పార్టీ నాయకులు అధికారులతో కుమ్మక్కై ఇంటిపట్టాలు ఇచ్చేందుకు సిద్ధం చేశారన్నారు. ఇప్పటికే ఇళ్లు, ఇంటిపట్టాలు ఉన్నవారికే తిరిగి ఆ స్థలంలో పట్టాలు ఇవ్వడానికి సిద్ధం చేస్తున్నారని, ఆ స్థలంలో ఎస్సీలకు పట్టాలు ఇవ్వాలని కోరారు. వినతి పత్రం ఇచ్చిన వారిలో మండల కన్వీనర్ సుధాకర్, నాయకులు ఓబుళపతి, రంగనాయకులు, నాగభూషణ, బోయనరసింహులు, హరిజన వెంకటరాముడు, హరిజన నారాయణ ఉన్నారు.


బాలల కుటుంబాలకు బీమా అందజేత

అనంతపురం విద్య, జనవరి 25: జిల్లాలో ఇటీవల ప్రమాదవశాత్తు మరణించి బాలల కుటుంబీలకు బాలల బీమా మొత్తాన్ని సమగ్రశిక్ష ఏపీసీ వరప్రసాద్ గురువారం తన చాంబర్‌లో అందజేశారు. యల్లనూరు మండలం జడ్పీ హైస్కూల్‌కు చెందిన ఎనిమిదో తరగతి విద్యార్థి కిరణ్, చెన్నేకొత్తపల్లి మండలం బసంపల్లి ప్రైమరీ స్కూల్‌కు చెందిన ఐదో తరగతి విద్యార్థి శ్రీధర్ ఇటీవల ప్రమాదవశాత్తు నీట మునిగి మరణించారు. అదేవిధంగా బుక్కరాయసముద్రం మండలం పాములాయి ప్రైమరీ స్కూల్‌కు చెందిన ఐదో తరగతి విద్యార్థి చరణ్య రోడ్డు ప్రమాదంలో మరణించారు. దీంతో ఆ ముగ్గురు విద్యార్థుల ఒక్కో కుటుంబానికి రూ. 25 వేలు చొప్పున అందించారు.

నా భూమి ఇప్పించండి.. సారూ..

చెన్నేకొత్తపల్లి, జనవరి 25: తన పేరిట ఉన్నభూమిని దౌర్జన్యంగా ఆక్రమించుకున్నారని, తనకు న్యాయం చేయాలని మండలంలోని హరియన్‌చెరువు గ్రామానికి చెందిన ముత్యాలమ్మ తహసీల్దార్ షాబుద్దీన్‌ను గురువారం విజ్ఞప్తి చేశారు. న్యామద్దల రెవెన్యూ పరిధిలో సర్వేనెంబరు 704-1లో తనకు 4.80 ఎకరాలు ఉందని, భూ పంపిణీ కింద 2008లో పట్టా మంజూరు చేశారని అన్నారు. తన భర్త అనారోగ్యం కారణంగా పట్టాదారు పాసుపుస్తకం, 1బీ అడంగల్‌ను చేసుకోలేదన్నారు. ఈ క్రమంలో గ్రామానికి చెందిన మరో మహిళ 2022లో తన భూమిపై పాసు పుస్తకాన్ని చేయించుకున్నారని, దీనిపై తాను కోర్టుకు కూడా వెళ్లానని అన్నారు. ప్రస్తుతం కోర్టులో వివాదం ఉండగానే దౌర్జన్యంగా తన భూమిలోకి వచ్చి ఆక్రమించుకుంటున్నారని ఆమె వాపోయారు. భూమికి సంబంధించి రికార్డులను పరిశీలించి చర్యలు తీసుకుంటామని తహసీల్దార్ ఆమెకు హామీ ఇచ్చారు.

28న ఉమ్మడి జిల్లాలో షర్మిల పర్యటన



మాట్లాడుతున్న సాకే శైలజానాథ్

అనంతపురంన్యూటౌన్, జనవరి 25: రాష్ట్ర పీసీసీ అధ్యక్షురాలు షర్మిల ఈనెల 28న ఉమ్మడి జిల్లాలో పర్యటిస్తారని పీసీసీ మాజీ అధ్యక్షుడు సాకే శైలజానాథ్ తెలిపారు. గురువారం స్థానిక ఆ పార్టీ కార్యాలయంలో ఆయన మాట్లాడుతూ.. జిల్లా పర్యటనలో భాగంగా నగరంలోని లలిత కళాపరిషత్‌లో నిర్వహించే సమావేశానికి కేవీపీ రామచంద్రరావు, రఘువీరారెడ్డి తదితరులు హాజరవుతారన్నారు. పలువురు ప్రముఖులు పార్టీలోకి చేరనున్నట్లు తెలిపారు.

విగ్రహ ఏర్పాటుకు అనుమతివ్వండి

బుక్కరాయసముద్రం : మండలంలోని చెన్నంపల్లి గ్రామంలో వాల్మీకి విగ్రహ ఏర్పాటుకు అనుమతి ఇవ్వాలని టీడీపీ రైతు విభాగం నియోజకవర్గం సహాయ కార్యదర్శి మల్లికార్జునరెడ్డి, పలువురు టీడీపీ నేతలు తహసీల్దార్ రమాదేవి, ఈఓఆర్డీ దామోదరమ్మకు వినతి పత్రం అందజేశారు. కార్యక్రమంలో వాల్మీకి సంఘం నేతలు పెద్దన్న, వెంకటప్ప, మారుతి, రామాంజినేయులు పాల్గొన్నారు.



వినతి పత్రం ఇస్తున్న టీడీపీ నేతలు

జగన్‌కు ఓటమి తప్పదు

టీడీపీ శింగనమల నియోజకవర్గ ఇన్‌చార్జి బండారు శ్రావణిశ్రీ

శింగనమల, జనవరి 25: రానున్న ఎన్నికలల్లో సీఎం జగన్‌రెడ్డి ఓటమి తప్పదని చంద్రబాబును ముఖ్యమంత్రి కావడం ఖాయమని శింగనమల నియోజకవర్గం టీడీపీ ఇన్‌చార్జ్ బండారు శ్రావణిశ్రీ ధీమా వ్యక్తం చేశారు.గురువారం శింగనమల మండలంలోని నిదనవాడలో బాబు ష్యూరిటీ భవిష్యత్ గ్యారెంటీ కార్యక్రమాన్ని నిర్వహించారు. రాష్ట్ర అన్ని రంగాల్లో అభివృద్ధి చెందాలంటే టీడీపీనే గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో మండల కన్వీనర్ గుత్తా ఆదినారాయణ, మాజీ ఎంపీపీలు అమృత, ఎం.లక్ష్మీదేవమ్మ, మాజీ జడ్పీటీసీ షాలిని, నాయకులు పాల్గొన్నారు.

నిదనవాడలో ప్రచారం చేస్తున్న బండారు శ్రావణిశ్రీ →



'రా.. కదలిరా'ను జయప్రదం చేయండి

అనంతపురం అర్బన్, జనవరి 25: మాజీ సీఎం చంద్రబాబు నాయుడు శనివారం ఉరవకొండలో చేపట్టే రా కదలిరా కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని అనంతపురం అర్బన్ నియోజకవర్గం పరిశీలకుడు రమణారెడ్డి పిలుపునిచ్చారు. గురువారం స్థానిక నాయక్ నగర్‌లో ఆయన మాట్లాడుతూ.. టీడీపీ నాయకులు, కార్యకర్తలు పెద్ద ఎత్తున ఈ కార్యక్రమాన్ని తరలిరావాలని కోరారు. ఈ సమావేశంలో మాజీ డిప్యూటీ మేయర్ గంపన్న, టీడీపీ జిల్లా అధికార ప్రతినిధి సరిపూటి రమణ, నాయకులు మారుతీకుమార్ గౌడ్, ముక్తియార్, జిలాన్ బాషా, పరమేష్, షణ్ముఖ, రవి, రజాక్, సరిపూటి శ్రీకాంత్, హసీనా, మనోహర్, ఓబుళరెడ్డి, వెంకటేష్, తాహిర్ పాల్గొన్నారు.

అలాగే అనంతపురం ఆజాద్ నగర్‌లో టీడీపీ రాష్ట్ర కార్యదర్శి తలారి ఆదినారాయణ ఆధ్వర్యంలో గురువారం నిర్వహించిన సమావేశంలో టీడీపీ రాష్ట్ర పార్టీ పరిశీలకులు జిలాన్ బాషా మాట్లాడారు. రా.. కదిలిరా కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని కోరారు. కార్యక్రమంలో నాయకులు చేపల హరి, ముక్తియార్, శ్రీనివాస్ చౌదరి, శ్రీనివాస్‌రెడ్డి, కరీం బాషా, రవికుమార్, రాము, కుమార్ పాల్గొన్నారు.

అనంతపురంరూరల్: చంద్రబాబు నాయుడు శనివారం ఉరవకొండలో చేపట్టిన రా కదిలిరా బహిరంగ సభను విజయవంతం చేయాలని నియోజకవర్గం పరిశీలకులు రమణారెడ్డి పేర్కొన్నారు. గురువారం జిల్లా కేంద్రంలోని మాజీ డిప్యూటి మేయర్ సాకే గంపన్న నివాసంలో మండలంలోని రుద్రంపేట నాయకులు, కార్యకర్తలతో ఆయన సమావేశం నిర్వహించారు. కార్యక్రమంలో నగర అధ్యక్షుడు మారుతికుమార్‌గౌడ్, మాజీ కార్పొరేటర్ నటేష్‌చౌదరి, క్లస్టర్ ఇన్‌చార్జ్ గోపాల్‌గౌడ్, యూనిట్ ఇన్‌చార్జ్ బాలప్ప పాల్గొన్నారు.

నార్పల : ఉరవకొండలో రా కదిలిరా సభను జయప్రదం చేయాలని నియోజకవర్గ పరిశీలకుడు గుర్రపనాయుడు, టీడీపీ రాష్ట్ర కార్యదర్శి, నియోజకవర్గ ద్విసభ్యకమిటీ సభ్యుడు ఆలం నరసానాయుడు, నార్పల మండల రా కదిలిరా ప్రోగ్రామ్ ఇన్‌చార్జి తలారి ఆదినారాయణ పిలుపునిచ్చారు. స్థానిక టీడీపీ కార్యాలయంలో వారు మాట్లాడారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నాయకులు పిట్టు రంగారెడ్డి, రాఘవనాయుడు, చంద్రశేఖర్‌రెడ్డి, చంద్రబాబు, లక్ష్మీనారాయణ, కుల్లాయప్ప, జనసేన మండల కన్వీనర్ రామకృష్ణ పాల్గొన్నారు.

గార్లదిన్నె: స్థానిక రామదాసుపేట సమీపంలో ద్విసభ్య కమిటీ సభ్యులు ముంటిమడుగు కేశవరెడ్డి, ఆలం నరసానాయుడు ఆధ్వర్యంలో నాయకులు, కార్యకర్తల సమావేశం నిర్వహించారు. ఇందులో గుర్రప్పనాయుడు మాట్లాడుతూ... రా కదిలిరా కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కోరారు.



మాట్లాడుతున్న జాన్సన్‌బాబు

విద్యాసంస్థలపై చర్యలు తీసుకోండి

అనంతపురం విద్య, జనవరి 25: జిల్లాలోని పలు కార్పొరేట్, ప్రైవేట్ స్కూళ్లు ఫీజుల కోసం విద్యార్థులను వేధిస్తున్నాయని, అలాంటి సంస్థలపై అధికారులు చర్యలు తీసుకోవాలని ఏఐఎస్ఎఫ్ నాయకులు డిమాండ్ చేశారు. గురువారం ఆ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు జాన్సన్ బాబు, జిల్లా అధ్యక్షుడు రమణయ్య, జిల్లాప్రధాన కార్యదర్శి కుళ్లాయి స్వామి స్థానిక సీపీఐ కార్యాలయంలో మాట్లాడారు. కొన్ని కార్పొరేట్ విద్యాసంస్థల యాజమాన్యాలు మొత్తం ఫీజులు చెల్లిస్తేనే స్కూళ్లలోకి అనుమతి ఇస్తామంటూ విద్యార్థులను బయటే నిలబెడుతున్నాయని మండిపడ్డారు. ఈ విషయాన్ని జిల్లా విద్యాశాఖాధికారుల దృష్టికి తీసుకెళ్లినా... ఏమాత్రం పట్టించుకోవడం లేదన్నారు. అధికారులు ఆయా సంస్థలపై చర్యలు తీసుకోవాలని, లేకుంటే రాష్ట్ర వ్యాప్తంగా ఆందోళన కార్యక్రమాలు నిర్వహిస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో ఆ సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు వంశీ, నగర అధ్యక్షుడు ఉమామహేష్, నాయకులు మంజునాథ్, హరికృష్ణ, విశ్వనాథ్, హరీష్, చందు పాల్గొన్నారు.

పారా అథ్లెటిక్స్ విజేతలకు ఎస్పీ అభినందన



క్రీడాకారులను అభినందిస్తున్న ఎస్పీ

అనంతపురం క్లాక్‌టవర్, జనవరి 25: జాతీయస్థాయి పారా అథ్లెటిక్ విజేతలను ఎస్పీ అన్బురాజన్ తన చాంబర్‌లో గురువారం అభినందించారు. ఈనెల 9 నుంచి 13వ తేదీ వరకు గోవాలో నిర్వహించిన 22వ జాతీయ స్థాయి పారా అథ్లెటిక్ చాంపియన్‌షిప్ పోటీల్లో జిల్లాకు చెందిన సాకే బాబు బంగారు పతకం, నీలం పల్లవి, నీలం సంజయ్‌రెడ్డి కాంస్య పతకాలు సాధించారు. ఈ విజేతలను ఎస్పీ సన్మానించారు. కార్యక్రమంలో జిల్లా పారా స్పోర్ట్స్ అధ్యక్ష, కార్యదర్శులు నాగరాజు, శ్రీనివాసులు, శాప్ కోచ్ మంజుల పాల్గొన్నారు.

కలెక్టరేట్ అధికారులా.. వైసీపీ తొత్తులా..!

అనంతపురం సెంట్రల్, జనవరి 25: కలెక్టరేట్‌లో బాధ్యతాయుతంగా పనిచేయాల్సిన అధికారులు.. వైసీపీ నాయకుల తొత్తులుగా మారి ప్రజలను మోసం చేస్తున్నారని ఎస్సీ, ఎస్టీ సంఘాల జేఏసీ రాష్ట్ర అధ్యక్షుడు సాకే హరి మండిపడ్డారు. ప్రజా సమస్యలు పరిష్కరించాలని గురువారం ఎస్సీ, ఎస్టీ సంఘాల జేఏసీ ఆధ్వర్యంలో కలెక్టర్ గౌతమిని కోరారు. హెచ్చెల్సీ అనంత డివిజన్‌లో డీఈ విశ్వనాథరెడ్డి ఏఈని కులం పేరుతో దూషించి దుర్భాషలాడినా సస్పెండ్ చేయలేదన్నారు. విద్యార్థులు, ఉద్యోగులను ఇబ్బందులకు గురిచేసిన గిరిజన గురుకుల పాఠశాల ప్రిన్సిపాల్‌పై కమిటీ నిజనిర్ధారణచేసినా నివేదికలను తొక్కిపెట్టారన్నారు. ఇలా అన్ని ప్రభుత్వ శాఖల్లో అక్రమార్కులకు కలెక్టరేట్ అధికారులు కొమ్ముకాస్తున్నారని మండిపడ్డారు. ఇప్పటికైనా అక్రమార్కులు, దాడులు, దౌర్జన్యాలకు పాల్పడుతున్నవారిని కఠినంగా శిక్షించి బాధితులకు న్యాయం చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో నాయకులు ఉమామహేశ్వరి, మారెప్ప, ఓబులేసు, లక్ష్మీనారాయణ పాల్గొన్నారు.

యువతను నట్టేట ముంచిన జగన్

అనంతపురం అర్బన్, జనవరి 25: సీఎం జగన్ యువతను నట్టేట ముంచాడని యూత్ ఎడ్యుకేషన్ ఎంప్లాయ్‌మెంట్ అండ్ వెల్ఫేర్ అసోషియేషన్ అధ్యక్షుడు గైబువల్లి ఒక ప్రకటనలో మండిపడ్డారు. అధికారంలోకి రాగానే ప్రతి జనవరిలో జాబ్ క్యాలెండర్‌ను విడుదల చేస్తానని హామీ ఇచ్చిన జగన్.. ఆ విషయంలో ఘోరంగా విఫలమయ్యారన్నారు. ఇప్పటికైనా తక్షణమే ఉద్యోగాల నోటిఫికేషన్‌ను విడుదల చేయాలని డిమాండ్ చేశారు. లేని పక్షంలో రాబోవు ఎన్నికల్లో జగన్ తగిన మూల్యం చెల్లించుకోక తప్పదన్నారు.

ఎన్టీఆర్ మార్గ్ ఆక్రమణ

అనంతపురం అర్బన్, జనవరి 25: అనంతపురం ఎన్టీఆర్ మార్గ్‌లో రోడ్డును ఆక్రమించి భవనం నిర్మించారని, దీంతో అది ప్రమాదరకంగా మారిందని అనంతపురం నగర పాలక సంస్థ కమిషనర్ మేఘస్వరూప్‌కు టీడీపీ నాయకులు జేఎం బాషా, మల్లికార్జున అన్నారు. గురువారం నగర పాలక సంస్థ కార్యాలయంలో ఆయనకు ఫిర్యాదు చేశారు. దీనిపై సమగ్ర విచారణ చేసి తగు చర్యలు తీసుకోవాలని కోరారు.

డీఈపై చర్యలు తీసుకోండి



హెచ్చెల్సీ డిప్యూటీ ఎస్ఈతో మాట్లాడుతున్న నాయకులు

అనంతపురం క్లాక్‌టవర్, జనవరి 25: హెచ్చెల్సీలోని దళిత ఇంజనీరు రామచంద్రమూర్తిని కులం పేరుతో దూషించిన డీఈ విశ్వనాథ్ రెడ్డిపై శాఖాపరమైన చర్యలు తీసుకోవాలని ఆర్‌ఈఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు రామచంద్ర డిమాండ్ చేశారు. ఈ మేరకు గురువారం ఆర్‌ఈఎఫ్ ఆధ్వర్యంలో హెచ్చెల్సీ డిప్యూటీ ఎస్ఈ సునీల్‌నాయక్‌ను కలిసి వినతిపత్రం అందజేశారు. ఆర్‌ఈఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు రామచంద్ర మాట్లాడుతూ డీఈపై చర్యలు లేనిపక్షంలో రిజర్వేషన్ వర్గాలు ఏకమై ప్రజాస్వామ్య పద్ధతుల్లో ఆందోళనలు చేపడుతామని హెచ్చరించారు. డిప్యూటీ ఎస్ఈ స్పందిస్తూ ఈ ఘటనపై ఉన్నతాధికారులకు నివేదిక అందజేస్తామన్నారు. కార్యక్రమంలో ఆర్‌ఈఎఫ్ రాష్ట్ర గౌరవాధ్యక్షుడు రామకృష్ణ, జిల్లా గౌరవాధ్యక్షుడు మల్లేష్, జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు సుధాకర్, గోవిందు, రాష్ట్ర అధికారప్రతినిధి ఏ గోవిందు, రాయలసీమ ప్రధాన కార్యదర్శి మల్లికార్జున, భాషా, గంగయ్యసూర్యనారాయణ, మద్దిలేటి పాల్గొన్నారు.

ధర్మవరం ఎమ్మెల్యేను తొలగించాలి

అనంతపురం సెంట్రల్: భూములు కబ్జా జేసి అధికారులను బలిచేస్తున్న ఎమ్మెల్యే కేతిరెడ్డి వెంకట్రామిరెడ్డిని వెంటనే ఆ పదవి నుంచి తొలగించాలని దళిత సంఘాల నాయకులు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. తహసీల్దార్ యోగేశ్వరిదేపై సస్పెండ్‌ను ఎత్తివేయాలన్నారు. గురువారం స్థానిక అంబేడ్కర్ విగ్రహం వద్ద దళిత సంఘాల నాయకుల ఆధ్వర్యంలో నిరసన చేశారు. ఆర్‌ఈఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు డాక్టర్ రామచంద్ర మాట్లాడుతూ.. వైసీపీ అరాచక పాలనతో ప్రభుత్వ ఉద్యోగులు బలి అవుతున్నారన్నారు. కలెక్టర్, ఆర్డీఓ కనుసన్నల్లో వెంకట్రామిరెడ్డి భూముల అక్రమాలకు పాల్పడితే ఎమ్మార్వోను సస్పెండ్ చేయడం ఏంటని ప్రశ్నించారు. సీఎం జగన్‌రెడ్డి తన ఎమ్మెల్యేలతో దళిత ఉద్యోగులపై కుట్రలు పన్నుతున్నారని మండిపడ్డారు. ఎమ్మార్వో యోగేశ్వరిదేవిపై సస్పెండ్ ఎత్తివేయకపోతే ప్రభుత్వంపై పోరు సాగిస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో సంఘాల నాయకులు ఓబులేసు, కుళ్లాయప్ప, రామకృష్ణ, రమణ, రామాంజి, పక్కీరప్ప పాల్గొన్నారు.

నిజాయితీ చాటుకున్న యువకుడు

అనంతపురం క్రైం : నగరానికి చెందిన మహమ్మద్ వలీ తనకు దొరికిన మూడు తులాల బంగారు నగలను సంబంధిత వ్యక్తికి అందజేసి తన నిజాయితీ చాటుకున్నాడు. హౌసింగ్ బోర్డుకు చెందిన రామచంద్రుడు గురువారం బంగారు ఆభరణాలున్న బ్యాగును బైక్‌కు తగిలించుకొని వెళ్తుండగా.. డీమార్ట్ సమీపంలోని ఆ బ్యాగ్ పడిపోయింది. దీన్ని గమనించకుండా రామచంద్రుడు వెళ్లిపోయాడు. అటుగా వెళ్తున్న మహమ్మద్ వలీ ఆ బ్యాగ్‌ను తీసుకొని పరిశీలించాడు. బంగారు గొలుసు, కమ్మలు, బ్యాంక్ పాసుబుక్ ఉండటాన్ని గమనించిన వలీ దాన్ని నాలుగో పట్టణ పోలీసులకు అందజేశాడు. బ్యాంక్ పాసుబుక్ ఆధారంగా అవి రామచంద్రుడుకి చెందినవి గుర్తించి.. ఆయనకు అందజేశారు. రామచంద్రుడు వలీకి రూ.5వేలు అందజేసి కృతజ్ఞతలు తెలిపాడు. డీఎస్పీ ప్రసాద్‌రెడ్డి, ఎస్ఐ నాగమధు వలీని అభినందించారు.



భానూబీ ఆందోళనకు మద్దతు పలుకుతున్న సీపీఐ నాయకులు

భానూబీ భూపోరాటానికి మద్దతు

అనంతపురం టౌన్, జనవరి 25: తమ భూమిని వైసీపీ ఎమ్మెల్యే అనుచరుడు వడ్డే వేణు ఆక్రమించుకున్నారని శింగనమల మండలం ఆకులేడుకు చెందిన వృద్ధురాలు భానూబీ కలెక్టరేట్ వద్ద చేపట్టిన పోరాటం గురువారమూ కొనసాగింది. దీనికి సీపీఐ జిల్లా కార్యదర్శి జాఫర్, సహాయ కార్యదర్శులు నారాయణస్వామి. మల్లికార్జున, ఏఐటీయూసీ జిల్లా అధ్యక్షుడు చిరంజీవి, ఏఐవైఎఫ్ నాయకులు ఆనంద కుమార్, సంతోష్‌కుమార్, హోహన్‌బాబు తదితరులు సంఘీభావం తెలిపారు. అలాగే టీడీపీ మైనార్టీ సెల్ రాష్ట్ర ఆర్గనైజింగ్ సెక్రెటరి సైఫుద్దీన్, ఇతర ప్రజా దళిత సంఘాలు ప్రతినిధులు మద్దతు పలికారు.

అనంతపురం అర్బన్ : కలెక్టరేట్ వద్ద ధర్నా చేస్తున్న భానూబీకి టీడీపీ మైనార్టీ సెల్ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి సైఫుద్దీన్ గురువారం మద్దతుపలికారు. దీనిపై ఐదేళ్లుగా అధికారులకు ఫిర్యాదు చేసినా పట్టించుకోలేదన్నారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు పవన్, నాగేంద్ర, మహ్బార్ రఫీ పాల్గొన్నారు.

వృద్ధుడి ఆత్మహత్య

చెన్నేకొత్తపల్లి, జనవరి 25: జీవితంపై విరక్తి చెందిన ఓ వృద్ధుడు ఆత్మహత్య చేసుకున్నాడు. బత్తలపల్లి మండలం వేల్పుమడుగు గ్రామానికి చెందిన మహానందిరెడ్డి (75) దాదాపు 40 సంవత్సరాల క్రితం భార్య వదిలేసింది. అప్పటి నుంచి స్థానికంగా అన్నదమ్ముల వద్ద ఉంటూ ఉంటున్నాడు. 20 రోజుల క్రితం తన అన్నకుమారులు ఉన్న పల్లెన్నగారిపల్లికి వచ్చి ఉంటున్నాడు. వయోభారంతో ఇబ్బందులు పడుతున్నా అతను జీవితంపై విరక్తి ఇంటిలో పురుగుల మందు తాగాడు. గమనించిన కుటుంబసభ్యులు వెంటనే అతన్ని సీకేపల్లి ప్రభుత్వాస్పత్రికి తీసుకెళ్లారు. అక్కడి నుంచి 108లో ధర్మవరం ప్రభుత్వాస్పత్రికి తరలిస్తుండగా మార్గమధ్యలో మరణించాడు. కేసు దర్యాప్తులో ఉంది.

ఆటోను ఢీకొన్న లారీ.. ఒకరి మృతి

గార్లదిన్నె, జనవరి 25 : మండల పరిధిలోని రామదాసుపేట సమీపంలో జాతీయ రహదారిపై గురువారం రాత్రి జరిగిన ప్రమాదంలో గుంతకల్లు మండలం నక్కనదొడ్డికి చెందిన ఆటో డ్రైవర్ బోయ సుధాకర్ (26) మరణించాడు. అతను, తన స్నేహితుడు శివతో కలసి ఉదయం అనంతపురానికి వచ్చాడు. రామదాసుపేట వద్ద ఆటో నిలుపుకుని ఉండగా అనంతపురం నుంచి గుత్తి వైపు వెళ్తున్న లారీ ఢీ కొట్టింది. ఈ ప్రమాదంలో సుధాకర్ అక్కడికక్కడే మరణించాడు. శివ స్వల్పంగా గాయపడ్డాడు. పోలీసులు లారీ డ్రైవర్‌ను అదుపులోకి తీసుకున్నారు.

'రాధమ్మ ఘటనపై కేసు నమోదు చేయండి'

అనంతపురం క్రైం, జనవరి 25: శింగనమల మండలం తరిమెలకు చెందిన రాధమ్మను పెళ్లి చేసుకుంటానని నమ్మించి మోసం చేసిన ఘటనలో బాధితురాలికి న్యాయం జరిగేలా కేసు నమోదు చేయాలని ఎస్పీ అన్బురాజన్ ఆదేశించారు. రాధమ్మ అక్కడే ఉన్న ఎస్సీ బాలుర వసతిగృహంలో పనిచేస్తున్న సమయంలో ఓ వ్యక్తి ప్రేమ పేరుతో మోసం చేయడంతో ఆమె ఏడాది క్రితం ఆత్మహత్యకు యత్నించిన విషయం తెల్సిందే. ఇటీవల ఎస్పీని కలిసి ఆమె తన సమస్యను వివరించింది. దీంతో ఆయన కేసు నమోదు చేయాలని పోలీసులను ఆదేశించారు.

28న ప్రమాణ స్వీకారోత్సవం



పోస్టర్ ఆవిష్కరిస్తున్న జిల్లా నాయకులు

అనంతపురం కల్చరల్, జనవరి 25: జిల్లా ఆర్యవైశ్య సంఘం నూతన కమిటీ సభ్యుల ప్రమాణ స్వీకారోత్సవాన్ని గుత్తి రోడ్డులోని కేటీఆర్ ఫంక్షన్ హాల్‌లో ఆదివారం నిర్వహిస్తున్నట్లు ఆ సంఘం జిల్లా అధ్యక్షుడు సిరిగుప్ప వెంకటేశ్వర్లు తెలిపారు. అందుకు సంబంధించిన పోస్టర్‌ను గురువారం స్థానిక వైశ్య హాస్టల్‌లోని ఆ సంఘం కార్యాలయంలో విడుదల చేసిన ఆయన మాట్లాడారు. కార్యక్రమానికి ఉభయ తెలుగు రాష్ట్రాల్లోని ఆర్యవైశ్య ప్రముఖులు హాజరవుతున్నారని, జిల్లా ఆర్యవైశ్యుల సంక్షేమానికి చేపట్టే భవిష్యత్ కార్యక్రమాలపై చర్చిస్తారని తెలిపారు. జిల్లాలోని ఆర్యవైశ్యులంతా పెద్ద సంఖ్యలో హాజరై ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలన్నారు. కార్యక్రమంలో జిల్లా ఆర్యవైశ్య సంఘం ప్రధాన కార్యదర్శి మనోజ్, కోశాధికారి సత్యరంగయ్య, అదనపు కార్యదర్శులు సత్రసాల మంజునాథ్, రమేష్ రంగయ్య, శ్రీనివాసులు శెట్టి పాల్గొన్నారు.

నేడు 'సంత్ సేవాలాల్' రథయాత్ర

అనంతపురం కల్చరల్, జనవరి 25: బంజారాల ఆరాధ్య దైవం సంత్ శ్రీ సేవాలాల్ మహరాజ్ జయంతిని పురష్కరించుకుని శుక్రవారం నగరంలో శాంతి సద్భావన యాత్ర నిర్వహిస్తున్నట్లు సేవాఘడ్ ట్రస్టు ప్రధాన కార్యదర్శి, టీటీడీ బోర్డు సభ్యుడు అశ్వర్థనాయక్ పేర్కొన్నారు. గురువారం స్థానిక ఆర్అండ్‌బీ అతిథి గృహంలో ఆయన మాట్లాడుతూ.. శుక్రవారం మధ్యాహ్నం మూడు గంటలకు స్థానిక రెండో రోడ్డులోని బంజారా భవన్ నుంచి శాంతి సద్భావన యాత్ర క్లాక్‌టవర్, సప్తగిరి సర్కిల్, విద్యుత్‌నగర్ సర్కిల్ మీదుగా నాయక్‌నగర్‌లోని మారెమ్మ దేవాలయం సాగుతుందన్నారు. అనంతరం ఆ యాత్ర పోస్టర్‌ను ఆవిష్కరించారు. కార్యక్రమంలో అఖిల భారత బంజారా సేవాసంఘ్ జిల్లా అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు బాలాజినాయక్, బాబూ నాయక్, సేవాఘడ్ ట్రస్టు కోశాధికారి బాలానాయక్, ఉపాధ్యక్షుడు బిఆర్ రంగ్లానాయక్, ఏబీఎస్ఎస్ జిల్లా ఉపాధ్యక్షుడు కిరణ్‌కుమార్‌నాయక్ పాల్గొన్నారు.

ముస్లింలకు జగన్ అన్యాయం : జనసేన

అనంతపురం రూరల్, జనవరి 25: లేనిపోని హామీలతో రాష్ట్ర ముఖ్యమంత్రి జగన్ మోహన్‌రెడ్డి ముస్లింలను మోసం చేశారని జనసేన రాయలసీమ రీజినల్ ఉమెన్ కో ఆర్డినేటర్ పెండ్యాల శ్రీలత విమర్శించారు. గురువారం మండలంలోని రుద్రంపేట పంచాయతీ చంద్రబాబు నగర్‌లో ఆమె మాటామంతి కార్యక్రమం నిర్వహించారు. అందులో భాగంగా స్థానిక ముస్లిం మతపెద్దలతో కలసి మాబుసుబాని దర్గాలో ప్రార్థనలు చేశారు. ముస్లిం, మైనార్టీలు అభివృద్ధి చెందాలంటే జనసేన, టీడీపీని గెలిపించాలన్నారు. ఈ కార్యక్రమంలో నగర ప్రధాన కార్యదర్శి పెండ్యాల చక్రపాణి, నాయకులు చాంద్, మన్సూర్, గౌస్‌మొద్దీన్, వీర మహిళలు లక్ష్మి, చంద్రకళ, సరోజమ్మ, గాయత్రి, సురేఖ, సానియ పాల్గొన్నారు.

ఘనంగా భాగవత సప్తాహం

నార్పల, జనవరి 25: స్థానిక తిక్కయ్యస్వామి ఆశ్రమంలో ఐదు రోజులుగా నిర్వహిస్తున్న భాగవత సప్తాహ కార్యక్రమం గురువారమూ కొనసాగింది. ఆధ్యాత్మిక వేత్తలు ప్రసంగాలతో తిక్కయ్య స్వామి ఆశ్రమం ఆధ్యాత్మిక శోభ ఉట్టిపడింది. కార్యక్రమంలో ఆశ్రమ నిర్వాహకులు గవ్వల సుబ్బయ్య, వెన్నపూస పల్లెబోగతి నారాయణరెడ్డి, సహధర్మచారిని బాల గంగమ్మ, ధ్యాన సభ్యులు శ్రీధర్, లక్ష్మీనారాయణ, చంద్ర, లింగారెడ్డి, రామసుబ్బారెడ్డి పాల్గొన్నారు.

గణతంత్ర పరేడ్‌కు జేఎన్‌టీయూ విద్యార్థిని

అనంతపురం సెంట్రల్, జనవరి 25: ఢిల్లీలో నిర్వహించే గణతంత్ర దినోత్సవ పరేడ్‌కు జేఎన్‌టీయూ విద్యార్థిని యామినీయాదవ్ ఎంపికైనట్లు గురువారం వర్సిటీ అధికారులు ఒక ప్రకటనలో తెలిపారు. ప్రీ రిపబ్లిక్ పరేడ్ శిక్షణకు రాష్ట్రం నుంచి పదిమంది ఎన్ఎస్ఎస్ వలంటీర్లు హాజరుకాగా అందులో యామినీయాదవ్ ఉన్నారన్నారు.



యామినీయాదవ్

జగన్ పాలనలో రాష్ట్రం నాశనం: సీపీఐ

అనంతపురం విద్య, జనవరి 25 : రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్ పాలనలో రాష్ట్రం అధోగతి పాలైందని, 56 నెలలగా ఏపీ ప్రజలను సీఎం జగన్ మోసం చేస్తూనే ఉన్నారని సీపీఐ రాష్ట్రకార్యదర్శి వర్గసభ్యుడు జగదీష్ విమర్శలు గుప్పించారు. గురువారం సీపీఐ కార్యాలయంలో ఆయన మాట్లాడుతూ.. ప్రజాధనాన్ని విచ్చలవిడిగా ఖర్చు చేశారేగానీ... ఏ ఒక్క హామినీ నెరవేర్చలేదన్నారు. ఇటీవల వైఎస్ఆర్ వర్ధంతి నేపథ్యంలో కళ్యాణదుర్గానికి విచ్చినప్పుడు ఇచ్చిన హామీలే కార్యరూపం దాల్చలేదన్నారు. బీటీపీ ప్రాజక్టు నిర్వాసితులకు రూ. 208 కోట్ల పరిహారం ఇస్తామని అప్పట్లో హామీ ఇచ్చారని, నేటికీ పూర్తిస్థాయి పరిహారం అందలేదని అన్నారు. కమ్యూనిటీ హాళ్ల నిర్మిస్తామని చెప్పారని, అయితే ఇప్పటి వరకూ ఏదీ అమలుకు నోచుకోలేదన్నారు. ఉరవకొండలో మరోసారి వాగ్దానాల వర్షం కురిపించారన్నారు. గతంలో ఇచ్చిన హామీలకు దిక్కులేదని, ఇప్పుడు జగన్ ఇచ్చినమాటలు కూడా బోగస్ గానే నిలిచేలా ఉన్నాయని ఎద్దేవా చేశారు. నాలుగేళ్లగా అమరావతి ఉద్యమం నడుస్తోందని, ఇప్పటికైనా సీఎం జగన్ బుద్ధిమార్చుకుని ఏపీకి అమరావతిని రాజధానిగా అంగీకరించాలన్నారు. కార్యక్రమంలో ఆ పార్టీ జిల్లా కార్యదర్శి జాఫర్, సహాయ కార్యదర్శులు నారాయణస్వామి, మల్లికార్జున, కార్యవర్గసభ్యులు శ్రీరాములు, నారాయణస్వామి, రాజేష్‌గౌడ్, సంతోష్‌కుమార్ పాల్గొన్నారు.



మాట్లాడుతున్న జగదీష్

బీసీల ఓట్లతో గద్దెనెక్కి వారిపైనే దాడులా..?

జయహో బీసీలో టీడీపీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ ఉమామహేశ్వరనాయుడు


కార్యక్రమంలో పాల్గొన్న నాయకులు

కళ్యాణదుర్గం, జనవరి 25: బీసీల ఓట్లతో గద్దెనెక్కి, చివరకు వారిపైనే దాడులు చేయిస్తున్న ప్రభుత్వం జగన్‌రెడ్డిదని టీడీపీ నియోజకవర్గ ఇన్‌చార్జి ఉమామహేశ్వరనాయుడు అన్నారు. గురువారం కంబదూరులో జయహో బీసీ సభను బీసీ సెల్ జిల్లా అధ్యక్షుడు ఆవుల క్రిష్ణయ్య అధ్యక్షతన స్థానిక ఆర్టీసీ బస్టాండు ప్రాంతంలో నిర్వహించారు. ముఖ్య అతిథులుగా సాంకేతిక విద్యాశాఖ ఉమ్మడి రాష్ట్రాల మాజీ మంత్రి పరుషరత్నం, కళ్యాణదుర్గం నియోజకవర్గ పరిశీలకులు నాగేశ్వర్‌యాదవ్ హాజరయ్యారు. ఈ సందర్భంగా ఉమామహేశ్వరనాయుడు మాట్లాడుతూ వైసీపీ ప్రభుత్వం అడ్డదారుల్లో అక్రమంగా చంద్రబాబునాయుడును అరెస్టు చేసి 53 రోజుల పాటు జైల్లో పెట్టించారన్నారు. జైల్లో ఉన్నంత మాత్రాన చంద్రబాబునాయుడుకు ఏ మాత్రం గౌరవం తగ్గలేదని, మరింత రెట్టింపు, ఆదరణ పెరిగిందన్నారు. చంద్రబాబునాయుడి హయాంలో బీసీలకు రాజ్యాధికారం కల్పించడమే కాకుండా, ఐదేళ్ల పాలనలో సుమారు రూ. 75 వేల కోట్లు సంక్షేమానికి ఖర్చుచేశారన్నారు. అందరూ సమష్టిగా పనిచేసి చంద్రబాబు నాయుడును సీఎం చేద్దామన్నారు. ఈ సందర్భంగా ఒంటారెడ్డిపల్లి, కురాకులపల్లికి చెందిన ఆరు కుటుంబాలు వైసీపీ నుంచి టీడీపీలోకి చేరారు. అంతకు ముందు నాయకులు గ్రామంలో ఊరేగింపుగా వస్తూ శ్రీకృష్ణదేవరాయలు, ఎన్టీఆర్ విగ్రహాలకు పూలమాలలు వేసి నివాళులు అర్పించారు.

రా.. కదలిరా సభకు 12 వేల మంది

మాజీ మంత్రి కాలవ శ్రీనివాసులు


మాట్లాడుతున్న మాజీ మంత్రి కాలవ

రాయదుర్గం, జనవరి 25: తెలుగుదేశం పార్టీ జాతీయ అధ్యక్షుడు నారా చంద్రబాబునాయుడు నిర్వహించనున్న రా.. కదలిరా సభకు రాయదుర్గం నియోజకవర్గం నుంచి 12 వేల మంది తరలివస్తారని మాజీ మంత్రి, పొలిట్ బ్యూరో సభ్యులు కాలవ శ్రీనివాసులు తెలిపారు. గురువారం పార్టీ కార్యాలయంలో నియోజకవర్గస్థాయి సమన్వయ కమిటీ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ శనివారం ఉరవకొండలో జరిగే బహిరంగసభను విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జగన్ పాలనలో అన్ని వర్గాల ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారన్నారు. చంద్రబాబు ప్రవేశపెట్టిన సూపర్‌సిక్స్ పథకాలను ప్రజల్లో విస్తృతంగా ప్రచారం చేయాలని కోరారు. కార్యక్రమంలో పార్టీ పట్టణ అధ్యక్షుడు పసుపులేటి నాగరాజు, నియోజకవర్గ పరిశీలకురాలు పర్వీన్‌తాజ్, జనసమీకరణ పరిశీలకులు గౌస్ మొయిద్దీన్, గోవర్ధన్‌రెడ్డి, మురళి, విశాలాక్షి తదితరులు పాల్గొన్నారు.
కణేకల్లు: చంద్రబాబు సమావేశానికి విరివిగా తరలిరావాలని మాజీమంత్రి కాలవ శ్రీనివాసులు పేర్కొన్నారు. గురువారం మండల కేంద్రంలోని చంద్రరైస్ మిల్‌లో కార్యకర్తల సమావేశాన్ని ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు లాలెప్ప, ఆనంద్‌రాజ్, వేలూరు మరియప్ప, సుదర్శన్, బీటీ రమేష్, ఆది, షేక్‌ముజ్జు, చంద్రశేఖర్‌గుప్తా, అనిల్ పాల్గొన్నారు.

జయప్రదం చేద్దాం: ఉమా

కళ్యాణదుర్గంరూరల్: ఉరవకొండలో శనివారం జరగనున్న రా.. కదలిరా.. సభను విజయవంతం చేద్దామని టీడీపీ నియోజకవర్గ ఇన్‌చార్జి మాదినేని ఉమామహేశ్వరనాయుడు పిలుపునిచ్చారు. గురువారం స్థానిక ఎన్టీఆర్ భవన్‌లో మాజీ మంత్రి పరషరత్నం, కర్నూలు పార్లమెంట్ అధ్యక్షుడు సోమిశెట్టి వెంకటేశ్వర్లు నియోజకవర్గ పరిశీలకులు నాగేశ్వరరావు, బీసీ సెల్ జిల్లా అధ్యక్షుడు ఆవుల క్రిష్ణయ్య, ఉమామహేశ్వరనాయుడుతో కలిసి సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రాష్ట్రంలో రాక్షస పాలన కొనసాగుతుందని, మరో 90 రోజుల్లో ఈ పాలన అంతం అవుతుందని స్పష్టం చేశారు. చంద్రబాబునాయుడు, నారా లోకేశ్ సభలకు స్వచ్ఛందంగా ప్రజలు,నాయకులు, కార్యకర్తలు తండోపతండాలుగా వస్తున్నారన్నారు. నియోజకవర్గం నుంచి కార్యకర్తలు, నాయకులు, అభిమానులు రా.. కదలిరా.. సభను జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు.

విజయవంతం చేయాలి


మాట్లాడుతున్న జితేంద్రగౌడ్

గుంతకల్లుటౌన్: రా..కదిలిరా కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని టీడీపీ మాజీ ఎమ్మెల్యే జితేంద్రగౌడ్ పేర్కొన్నారు. స్థానిక జితేంద్రగౌడ్ క్యాంపు కార్యాలయంలో గురువారం పట్టణం, మండల నాయకులతో సమావేశాన్ని నిర్వహించారు. సభకు కార్యకర్తలు, నాయకులు తరలి వచ్చి జయప్రదం చేయాలని కోరారు.

టీడీపీలోకి కురుబ సామాజికవర్గ నాయకులు


పార్టీలోకి ఆహ్వానిస్తున్న పయ్యావుల శ్రీనివాసులు

బెళుగుప్ప, జనవరి 25: మండలంలో గురువారం బెళుగుప్పకు చెందిన 25 మంది కురుబ సామాజికవర్గం నాయకులు అనంతపురంలో ఎమ్మెల్యే పయ్యావుల కేశవ స్వగృహంలో టీడీపీలో చేరారు. వీరికి పార్టీ సీనియర్ నాయకుడు పయ్యావుల శ్రీనివాసులు కండువా వేసి సాదరంగా ఆహ్వానించారు.

సమస్యలను పరిష్కరించాలి


గుత్తిలో నిరసన తెలుపుతున్న పెన్షనర్లు

11వ పీఆర్సీలో తగ్గించిన అదనపు పెన్షన్ యథావిధిగా ఇవ్వాలని, 70 సంవత్సరాల నిండిన వారికి 10శాతం, 75 సంవత్సరాల నిండిన వారికి 15శాతం పునరుద్ధరించాలని, హెల్త్‌కార్డుల ద్వారా అన్ని వ్యాధులకు వైద్యాన్ని అందించాలని, మెడికల్ రియంబర్స్‌మెంట్‌ను రూ. 2లక్షల నుంచి రూ. 5లక్షలకు పెంచాలని పెన్షనర్లు జిల్లావ్యాప్తంగా నిరసనలు తెలిపారు. తమ సమస్యలను వెంటనే ప్రభుత్వం పరిష్కరించాలని కోరారు.

– న్యూస్ నెట్‌వర్క్, ఆంధ్రజ్యోతి

బీసీ నాయకులపై వివక్ష

మున్సిపల్ అధికారుల నిర్లక్ష్య ధోరణి

రాయదుర్గం, జనవరి 25: గణతంత్ర దినోత్సవం సందర్భంగా ఆహ్వాన పత్రికల్లో మున్సిపల్ అధికారులు బీసీ నేతల పట్ల వివక్ష ప్రదర్శించడంపై తీవ్ర విమర్శలు గుప్పు మంటున్నాయి. ప్రోటోకాల్ ప్రకారం పూర్వ మున్సిపల్ చైర్మన్లను కూడా ఆహ్వానించాల్సి ఉంటుంది. అయితే మాజీ మున్సిపల్ చైర్మన్ గౌని ఉపేంద్రరెడ్డిని మాత్రమే ఆహ్వానించి మిగిలిన వారిని వదిలేశారు. మున్సిపల్ చైర్మన్లుగా కాంగ్రెస్ నుంచి గెలిచిన సోమమల్లేశప్పతోపాటు టీడీపీకి చెం దిన రాజశేఖర్, ముదుగల్లు జ్యోతి మాజీలుగా ఉన్నారు. గతంలో వీరిని ఆహ్వానించేవారు. అయితే ఏకపక్ష ధోరణిని అవలంబించేలా బీసీ వర్గానికి చెందిన సోమ మల్లేశప్ప, రాజశేఖర్, ముదుగల్లు జ్యోతిలను వదిలేశారు. దీంతో బీసీల పట్ల వివక్ష ప్రదర్శిస్తున్నారని మున్సిపల్ అధికారులపై మండి పడుతున్నారు. దీనిపై కమిషనర్ దివాకర్‌రెడ్డిని వివరణ కోరగా తనకు తెలియకుండా పొరపాటు జరిగిందని సరిదిద్దుకుంటామన్నారు.

రెండు గ్రామాల్లో బాబు ష్యూరిటీ... భవిష్యత్తుకు గ్యారంటీ


కరపత్రాలను పంపిణీ చేస్తున్న ఉన్నం హనుమంతరాయచౌదరి

కుందుర్పి, జనవరి 25: మండల పరిధిలోని జానంపల్లి, మండలపల్లి గ్రామాల్లో బాబు ష్యూరిటీ భవిష్యత్తు గ్యారెంటీని గురువారం మాజీ మండల కన్వీనర్ కేపీ రామాంజినేయులు ఆధ్వర్యంలో నిర్వహించారు. కార్యక్రమానికి టీడీపీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఉన్నం హనుమంతరాయచౌదరి హాజరయ్యారు. కరపత్రాలను పంపిణీ చేస్తూ మినీమేనిఫెస్టోలోని అంశాలను వివరించారు. కార్యక్రమంలో మాజీ జడ్పీటీసీ మల్లికార్జున, మాజీ కోఆప్షన్ మెంబర్ తాహీర్, తెలుగుయువత రామ్మోహన్ నాయుడు, ఓబుళేసు, చిరంజీవి, హనుమంతరాయుడు తదితరులు పాల్గొన్నారు.

రాష్ట్రాన్ని భ్రష్టు పట్టించారు: వెంకటశివుడుయాదవ్

గుంతకల్లుటౌన్, జనవరి 25: రాష్ట్రాన్ని భ్రష్టు పట్టించిన వైసీపీ ప్రభుత్వాన్ని ఇంటికి సాగనంపాలని టీడీపీ రాష్ట్ర కార్యదర్శి వెంకటశివుడు యాదవ్, టీడీపీ పట్టణ అధ్యక్షుడు బండారు ఆనంద్ పేర్కొన్నారు. పట్టణంలోని 37వ వార్డులోని మోదినాబాద్‌లోని పై కొట్టాలలో గురువారం బాబుష్యూరిటీ.. భవిష్యత్తు గ్యారెంటీ నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ వైసీపీ పాలనలో దోపిడీ, అక్రమాలు, అవినీతి, దౌర్జన్యాలు తప్ప అభివృద్ధి పూర్తిగా శూన్యం అన్నారు. అనంతరం ఇంటింటికి వెళ్లి కరపత్రాలను అందజేశారు. కార్యక్రమంలో 37వార్డు టీడీపీ నాయకులు వీరేష్‌గౌడ్, జార్జ్ ప్రతాప్, మాజీ సింగిల్‌విండో అధ్యక్షుడు సంజీవరాయుడు పాల్గొన్నారు.


మహిళలతో మాట్లాడుతున్న వెంకటశివుడు యాదవ్

కమలపాడులో ఫుడ్ సేఫ్టీ అధికారి విచారణ


పాఠశాలలో విచారణ చేపడుతున్న ఫుడ్‌సేఫ్టీ అధికారి

యాడికి, జనవరి 25: మండలంలోని కమలపాడు ప్రాథమికోన్నత పాఠశాలలో విద్యార్థులకు అస్వస్థతపై గురువారం ఉమ్మడి అనంతపురం జిల్లా ఫుడ్‌సేఫ్టి అధికారి రామచందర్ విచారించారు. పాఠశాలలో మధ్యాహ్న భోజనానికి వాడే పోర్టిఫైడ్ రైస్, చిక్కిల శాంపిళ్లను పరీక్షల నిమిత్తం తీసుకువెళుతున్నట్లు తెలిపారు. రిపోర్ట్ వచ్చిన తర్వాత ఎటువంటి చర్యలు తీసుకొనేది తెలియజేయజేస్తామని వివరించారు. పాఠశాలలో వంటగది అపరిశుభ్రంగా ఉందని తెలిపారు. వంటగదికి వెంటనే వైట్‌వాష్ చేయించాలని ఉపాధ్యాయులకు సూచించారు. ప్రభుత్వ వైద్యశాలకు వెళ్లి విద్యార్థుల ఆరోగ్యంపై వైద్యులను ఆరాతీశారు. కాలుష్యంతోనే విద్యార్థులకు దద్దుర్లు ఏర్పడినట్లు వైద్యులు తెలిపారని వెల్లడించారు.

పాఠశాలను పరిశీలించిన విద్య, వైద్యశాఖ అధికారులు

యాడికి: విద్యార్థులకు అస్వస్థత శీర్షికన ఆంధ్రజ్యోతిలో ప్రచురితమైన కథనానికి అధికారులు స్పందించారు. ఎంఈఓ కాశప్ప, ప్రభుత్వ వైద్యులు శ్రీరాంకుమార్, పరమేశ్వర్ కమలపాడు ప్రాథమికోన్నత పాఠశాలకు వెళ్లి పాఠశాల పరిసరాలను పరిశీలించారు. అస్వస్థతకు గురైన విద్యార్థుల ఆరోగ్య పరిస్థితిపై ఆరాతీశారు. విద్యార్థులకు ఎటువంటి ఇబ్బందులు కలుగకుండా చర్యలు తీసుకుంటామని ఎంఈఓ తెలిపారు.

అన్నదాతను ఆదుకోవాలి: ఏఐకేఎఫ్

తాడిపత్రిటౌన్, జనవరి 25: రైతులను కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఆదుకోవాలని అఖిల భారత రైతు సమాఖ్య రాష్ట్ర కార్యదర్శి భీమిరెడ్డి జగదీశ్వరరెడ్డి కోరారు. పట్టణంలోని ఆర్‌అండ్‌బీ బంగ్లాలో గురువారం జరిగిన సదస్సులో ఆయన మాట్లాడుతూ రైతే రాజు అంటున్న పాలకులు సాగు, తాగునీరు అందించడంలో విఫలమయ్యారన్నారు. దీంతో రైతులు ఆత్మహత్యలు చేసుకొనే పరిస్థితులు ఉన్నాయన్నారు. అనంతరం జిల్లా కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. జిల్లా అధ్యక్షుడిగా సుధాకరనాయుడు, ప్రధాన కార్యదర్శిగా మామిళ్ల నారాయణస్వామి, ఉపాధ్యక్షుడిగా బాబయ్య, కార్యదర్శిగా చిన్నప్పనాయక్, కోశాధికారిగా సుబ్బారెడ్డితోపాటు సభ్యులను ఎన్నుకున్నారు.

ఆటోను ఢీకొన్న లారీ.. ఒకరి మృతి

గార్లదిన్నె: మండల పరిధిలోని రామదాసుపేట సమీపంలో జాతీయ రహదారిపై గురువారం రాత్రి జరిగిన ప్రమాదంలో గుంతకల్లు మండలం నక్కనదొడ్డికి చెందిన ఆటో డ్రైవర్ బోయ సుధాకర్ (26) మరణించాడు. అతను, తన స్నేహితుడు శివతో కలసి ఉదయం అనంతపురానికి వచ్చాడు. రామదాసుపేట వద్ద ఆటో నిలుపుకుని ఉండగా అనంతపురం నుంచి గుత్తి వైపు వెళ్తున్న లారీ ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో సుధాకర్ అక్కడికక్కడే మరణించాడు. శివ స్వల్పంగా గాయపడ్డాడు. పోలీసులు లారీ డ్రైవర్‌ను అదుపులోకి తీసుకున్నారు.

అక్రమ మద్యం స్వాధీనం

రాయదుర్గంరూరల్, జనవరి 25: మండలంలోని రేకులకుంటకు వెళ్లే దారిలో దేవరకట్ట వద్ద 25 కేసుల అక్రమ మద్యం స్వాధీనం చేసుకున్నట్లు ఎక్సైజ్ ఏఎస్పీ రామకృష్ణ పేర్కొన్నారు. గురువారం సెబ్ స్థానిక కార్యాలయంలో ఆయన వివరాలు వెల్లడించారు. రాయదుర్గం మండలం ఆవులదట్ల గ్రామానికి చెందిన నారాయణనాయక్ బొలెరో వాహనంలో బుధవారం రాత్రి 25 కేసుల అక్రమ మద్యాన్ని తరలిస్తుండగా దేవరకట్ట వద్ద స్వాధీనం చేసుకున్నామన్నారు. అతడిని అదుపులోకి తీసుకున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో సీఐ మురళీమోహన్, ఎస్‌ఐ శ్రీధర్‌రావు, సిబ్బంది పాల్గొన్నారు.

సూపర్‌వైజర్‌పై దాడి

తాడిపత్రిటౌన్: మండలంలోని అర్జాస్ స్టీల్‌ప్లాంట్‌లో సూపర్‌వైజర్‌గా పనిచేస్తున్న వెంకటరమణపై గురువారం ముగ్గురు కార్మికులు దాడిచేసినట్లు పట్టణ ఎస్‌ఐ రామకృష్ణ తెలిపారు. డ్యూటీలు ఎక్కువగా వేశాడన్న కోపంతో ముగ్గురు కార్మికులు పట్టణంలోని బస్టాండ్ సమీపంలో గురువారం దాడిచేశారు. బాధితుడి ఫిర్యాదుమేరకు ముగ్గురిపై కేసు నమోదుచేశామని ఎస్‌ఐ తెలిపారు.

శివ మాలధారులకు అన్నదానం


అన్నదానం నిర్వహిస్తున్న దృశ్యం

పామిడి, జనవరి 25: పట్టణంలోని భోగేశ్వరస్వామి ఆలయంలో శివదీక్షా భక్తులకు పత్రా పుల్లయ్య కుటుంబ సభ్యులు ఆధ్వర్యంలో అన్నదానం కార్యక్రమం గురువారం ప్రారంభించారు. మండలం రోజులు మధ్యాహ్నం అన్నదానం నిర్వహిస్తున్నట్లు పత్రా పుల్లయ్య తెలిపారు. అన్నదాన కార్యక్రమాన్ని భక్తులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

ఆడుదాం ఆంధ్రాలో ఘర్షణ

ఉరవకొండ, జనవరి 25: పట్టణంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాల ఆవరణంలో నిర్వహించిన ఆడుదాం ఆంధ్రాలో ఘర్షణ చోటు చేసుకుంది. నియోజకవర్గ క్రికెట్ పోటీలు నిర్వహించారు. కూడేరు టీంకు అన్యాయం జరిగేలా పోటీలు రూపొందించారని వైసీపీ ట్రేడ్ యూనియన్ జిల్లా అధ్యక్షుడు మంజునాథ్ అధికారులతో వాగ్వాదానికి దిగారు. పీఈటీ, ఎంపీడీవో, ఎంపీపీ, అధికారులను నిలదీశారు. ఎంపీడీఓ పోలీసులకు సమాచారమివ్వగా అక్కడకు చేరుకుని సర్దిచెప్పారు. పోలీసుల భద్రత మధ్య పోటీలు సాగాయి.
కళ్యాణదుర్గంరూరల్: ఆడుదాం ఆంధ్రలో వాగ్వాదం చోటు చేసుకుంది. గురువారం పట్టణంలోని కరణం చిక్కప్ప ఉన్నత ప్రభుత్వ పాఠశాల మైదానంలో కళ్యాణదుర్గం, బ్రహ్మసముద్రం జట్లు కబడ్డీలో మూడవస్థానం కోసం పోటీపడాల్సివుంది. అయితే ఇందులో కర్ణాటక రాష్ట్రానికి చెందిన క్రీడాకారులు వారి ఆధార్ కార్డులలో ఉన్న అడ్రస్‌లను మార్పుచేసుకుని పోటీల్లో పాల్గొంటున్నారని కళ్యాణదుర్గం జట్టు తరపు క్రీడాకారులు వాగ్వాదానికి దిగారు. దీంతో ఆటను 27వ తేదీకి మార్చినట్లు అధికారులు తెలిపారు.

ఉత్తమ బీఎల్ఓకు ప్రశంస

రాయదుర్గం: రాష్ట్రస్థాయిలో ఉత్తమ బీఎల్ఓగా ఎంపికైన పవన్‌కుమార్‌కు రాష్ట్ర గవర్నర్ నజీర్ గురువారం విజయవాడలో ప్రశంస పత్రాన్ని అందించారు. జాతీయ ఓటరు దినోత్సవం సందర్భంగా అందించారు. అదేవిధంగా రాయదుర్గం ఎన్నికల డిప్యూటీ తహసీల్దార్ సుజాత, ఆపరేటర్ టీ రెహమాన్‌లకు విధుల్లో ఉత్తమ ప్రతిభ కనబరచినందుకుగాను కలెక్టర్ గౌతమి ప్రశంసపత్రాన్ని అందించారు.

దేశభక్తిని పెంపొందించుకోవాలి: కేసీ హరి


నృత్యం చేస్తున్న విద్యార్థులు

గుంతకల్లుటౌన్, జనవరి 25: సమాజంలో ప్రతి ఒక్కరూ దేశభక్తిని పెంపొందించుకోవాలని శ్రీ శంకరానందగిరి స్వామి డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ కేసీ హరి పేర్కొన్నారు. జాతీయ ఓటర్ల దినోత్సవం, రిపబ్లిక్ డే పురస్కరించుకుని దేశభక్తి అంశంపై ప్లాష్ మాబ్ గురువారం నిర్వహించారు. పట్టణంలోని పొట్టిశ్రీరాములు, ఎన్టీఆర్ సర్కిల్‌లో విద్యార్థులు ప్రదర్శించిన నృత్యాలు ఆకట్టుకున్నాయి. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నిత్యం పుస్తకాలతో కళాశాల గదిలో గడిపే విద్యార్థులు సందడిగా గడిపారన్నారు. దేశభక్తిపై ప్రజల్లో అవగాహన కల్పించేందుకు ప్లాష్ మాబ్‌ను ఏర్పాటు చేశామన్నారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ గోపాల్, అధ్యాపకులు పాల్గొన్నారు.

సమస్యలను పరిష్కరించాలి: యూటీఎఫ్

గుంతకల్లుటౌన్, జనవరి 25: మున్సిపల్ ఉపాధ్యాయుల సమస్యలను ప్రభుత్వం తక్షణమే పరిష్కరించాలని యూటీఎఫ్ నాయకులు పేర్కొన్నారు. పట్టణంలోని భగత్‌సింగ్ మున్సిపల్ పాఠశాల ఆవరణంలో గురువారం యూటీఎఫ్ నాయకులు నల్లరిబ్బన్లతో నిరసన తెలిపారు. యూటీఎఫ్ నాయకులు మాట్లాడుతూ మున్సిపల్ ఉపాధ్యాయులకు దీర్ఘకాలంగా పెండింగ్‌లో ఉన్న సర్వీస్ రూల్స్ రూపొందించి బదిలీలు, పదోన్నతులు కల్పించాలన్నారు. పీఎఫ్ సౌకర్యం కల్పించాలన్నారు. కార్యక్రమంలో యూటీఎఫ్ జిల్లా కోశాధికారి రాఘవేంద్ర, పట్టణ శాఖ అధ్యక్ష, కార్యదర్శులు రామకృష్ణ, రాజ్‌కుమార్, సుధాకర్, వెంకటేష్, గౌరవఅధ్యక్షుడు మల్లికార్జున, ఉపాధ్యక్షుడు రమేష్, కోశాధికారి ఎల్లన్న, మండల శాఖ ప్రధాన కార్యదర్శి కల్పన పాల్గొన్నారు.



నిరసన తెలుపుతున్న యూటీఎఫ్ నాయకులు

ఇసుక ట్రాక్టర్ సీజ్

యల్లనూరు: మండలంలోని చిత్రావతినది నుంచి అక్రమంగా ఇసుకను తరలిస్తున్న ట్రాక్టర్‌ను గురువారం సీజ్ చేసినట్లు ఎస్‌ఐ ధరణీబాబు తెలిపారు. శింగవరం గ్రామ సమీపంలోని నది నుంచి ట్రాక్టర్‌లోకి ఇసుకను నింపుతుండగా అదుపులోకి తీసుకొని స్టేషన్‌కు తరలించామని తెలిపారు.

మద్యం బాటిళ్లు స్వాధీనం

మండలకేంద్రంలో గురువారం మద్యం విక్రయిస్తున్న రామాంజనేయులు నుంచి 18 బాటిళ్లను స్వాధీనం చేసుకున్నామని ఎస్‌ఐ ధరణీబాబు తెలిపారు. బీసీ కాలనీలో మద్యం అమ్మకాలు జరుగుతున్నట్లు సమాచారం రావడంతో సిబ్బందితో కలిసి దాడులు నిర్వహించి నిందితుడిని అరెస్ట్‌చేసినట్లు తెలిపారు.

కార్యకర్తకు పరామర్శ

కూడేరు: మండలంలోని కొర్రకోడు గ్రామ టీడీపీ కార్యకర్త మణికంఠ ఇటీవల రోడ్డుప్రమాదంలో గాయపడటంతో నాయకులు పరామర్శించారు. గురువారం ఓ ప్రైవేటు ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న ఆయన్ను రాష్ట్ర బీసీ సెల్ నాయకుడు కురుగుంట బ్రహ్మయ్య, మాజీ సర్పంచు ప్రసాద్ తదితరులు పరామర్శించారు.

చికిత్స పొందుతూ వ్యక్తి మృతి

డీ.హీరేహాళ్, జనవరి 25: ప్రమాదానికి గురై పది రోజులుగా చికిత్స పొందుతున్న వ్యక్తి గురువారం మృతి చెందినట్లు ఎస్‌ఐ రంగడు యాదవ్ తెలిపారు. మండలంలోని మలపనగుడి గ్రామానికి చెందిన ఖాసీంవలి(38) ఈ నెల 12న పనినిమిత్తం బళ్లారికి వెళ్లి పని ముగించుకొని ద్విచక్రవాహనంపై స్వగ్రామానికి వస్తూ అదుపు తప్పి కిందపడ్డాడు. గాయపడ్డ ఖాసీంవలీని చికిత్స కోసం బళ్లారి ఆసుపత్రికి తరలించి చికిత్స అందిస్తుండగా గురువారం మృతి చెందాడు. కుటుంబసభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేస్తున్నట్లు ఆయన తెలిపారు.

వ్యక్తి ఆత్మహత్య

పెద్దవడుగూరు: మండలంలోని బందార్లపల్లి గ్రామానికి చెందిన చంద్ర (40) గురువారం పొలంలోని చెట్టుకు ఉరివేసుకొని ఆత్మహత్య చేసుకున్నట్లు పోలీసులు తెలిపారు. చంద్ర వ్యవసాయ పనులు చేసుకుంటూ జీవనం సాగించేవాడు. ఆత్మహత్యకు గల కారణాలు తెలియాల్సి ఉందని పోలీసులు తెలిపారు.

దాడి చేశారని ఫిర్యాదు

బెళుగుప్ప, జనవరి 25: మండలంలోని గంగవరంలో గురువారం వలంటీర్ తాగిన మైకంలో తమపై దాడి చేశాడని అదే గ్రామానికి చెందిన విరుపాక్షప్ప పోలీసులకు ఫిర్యాదు చేశారు. విచారించి చర్యలు తీసుకోవాలని కోరారు.

కాశీ విశ్వేశ్వరుడికి ప్రత్యేక పూజలు


ప్రత్యేక అలంకరణలో కాశీ విశ్వేశ్వరస్వామి

యాడికి, జనవరి 25: మండలంలోని రాయలచెరువులో గల కాశీ విశ్వేశ్వరస్వామి ఆలయ వార్షికోత్సవాన్ని పురస్కరించుకొని గురువారం ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా స్వామివారిని విశేషంగా అలంకరించారు. రుద్రాభిషేకం నిర్వహించారు. స్వామివారిని భక్తులు అధిక సంఖ్యలో దర్శించుకున్నారు. భక్తులకు అన్నదాన కార్యక్రమం నిర్వహించారు.

నేడు చంద్రబాబును కలవనున్న జేసీ కుటుంబం

తాడిపత్రి, జనవరి 25: విజయవాడలోని టీడీపీ పార్టీ కేంద్ర కార్యాలయంలో టీడీపీ అధినేత నారా చంద్రబాబునాయుడును శుక్రవారం జేసీ కుటుంబం కలవనుంది. తాడిపత్రిలో నెలకొన్న రాజకీయ పరిస్థితులు, టికెట్ అంశంపై మాజీ ఎంపీ జేసీ దివాకర్‌రెడ్డి, ఆయన కుమారుడు జేసీ పవన్‌రెడ్డి, మున్సిపల్ చైర్మన్ జేసీ ప్రభాకర్‌రెడ్డి ఆయన తనయుడు జేసీ అస్మిత్‌రెడ్డి కలవనున్నారు. చంద్రబాబు నుంచి అపాయింట్‌మెంట్ ఖరారు కావడంతో పెద్దవడుగూరు మండలంలో బస్సుయాత్ర చేస్తున్న చైర్మన్ జేసీ ప్రభాకర్‌రెడ్డి గురువారం ఉదయం హైదరాబాద్‌కు తరలివెళ్లారు. అక్కడి నుంచి మిగిలిన కుటుంబ సభ్యులతో కలిసి శుక్రవారం ఉదయం విజయవాడ వెళ్లి చంద్రబాబును కలవనున్నారు.

రిజర్వాయర్‌కు 428 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో

బెళుగుప్ప, జనవరి 25: మండలంలోని జీడిపల్లి రిజర్వాయర్‌లో ప్రస్తుతం 0.428 టీఎంసీలు వున్నట్లు గురువారం హంద్రీనీవా అధికారులు తెలిపారు. ప్రస్తుతం రిజర్వాయర్‌కు 428 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో వస్తుండగా ఇక్కడి నుంచి ఔట్‌ఫ్లో 520 క్యూసెక్కులు ఫేజ్-2కు వదులుతున్నట్లు వివరించారు. ప్రస్తుతం 0.434 టీఎంసీల నీరు నిల్వ వున్నట్లు తెలిపారు.

పోలింగ్ కేంద్రాల పరిశీలన

బెళుగుప్ప, జనవరి 25: మండలంలోని పలు గ్రామాల్లో గురువారం జాయింట్ కలెక్టర్ కేతన్ గార్గ్ విస్తృతంగా పర్యటించారు. పోలింగ్ కేంద్రాలను పరిశీలించారు. విద్యుత్, తాగునీటి వసతి, భద్రతా చర్యలు తదితర వాటిపై వివరాలు అడిగి తెలుసుకున్నారు. తహసీల్దార్ ఓబుళేసు, వ్యవసాయాధికారి పృథ్వీసాగర్, ఎస్‌ఐ శివ, వీఆర్వోలు రాజశేఖర్, యర్రిస్వామి జేసీ వెంట ఉన్నారు.

ఓటుతోనే నవసమాజ నిర్మాణం

– తహసీల్దార్ ఆర్వీ సునీతాబాయి

పామిడి, జనవరి 25: ఓటుతోనే నవసమాజ నిర్మాణ స్థాపన జరుగుతుందని తహసీల్దార్ ఆర్వీ సునీతా బాయి పేర్కొన్నారు. జాతీయ ఓటర్ల దినోత్సవాన్ని పురస్కరించుకొని పట్టణంలోని అంబేడ్కర్ సర్కిల్‌లో విద్యార్థులు, రెవెన్యూ ఉద్యోగులు మానవహారంగా ఏర్పడి ప్రతిజ్ఞ చేశారు. కార్యక్రమంలో సీఐ రాజశేఖర్‌రెడ్డి, డిప్యూటీ తహసీల్దార్ లక్ష్మీనారాయణరెడ్డి, ఆర్‌ఐ క్రాంతి కుమార్, వీఆర్వోలు, వీఆర్‌ఏలు, విద్యార్థులు, స్థానిక నాయకులు తదితరులు పాల్గొన్నారు.

రాజ్యాంగ పీఠిక అందజేత

గుంతకల్లుటౌన్, జనవరి 25: జాతీయ ఓటర్ల దినోత్సవాన్ని పురస్కరించుకుని భారత రాజ్యాంగ అవగాహన ఆధ్వర్యంలో గురువారం మున్సిపల్ కమిషనర్ మల్లికార్జున, డిప్యూటీ తహసీల్దారు రాము, మెప్మా అధికారి భవానికి రాజ్యాంగ పీఠికను అందజేశారు. భారత రాజ్యాంగ అవగాహన వేదిక కన్వీనర్ జింకల దివ్యభార్గవి, కన్వీనర్లు జింకల ప్రణతి తదితరులు అందజేశారు.

రేషన్‌బియ్యం పట్టివేత

పెద్దవడుగూరు: మండలకేంద్ర సమీపంలో గురువారం అక్రమంగా ఆటోలో తరలిస్తున్న 20ప్యాకెట్ల రేషన్‌బియ్యాన్ని పట్టుకున్నట్లు సీఐ శంకర్‌రెడ్డి తెలిపారు. సమాచారం మేరకు దాడులు నిర్వహించి డ్రైవర్‌తోపాటు మరొక వ్యక్తిని అరెస్ట్‌చేసి కేసునమోదు చేశామని సీఐ తెలిపారు.

పేకాటరాయుళ్ల అరెస్ట్

పెద్దవడుగూరు, జనవరి 25: మండలంలోని కాశేపల్లి గ్రామ సమీపంలో గురువారం 8 మంది పేకాటరాయుళ్లను అరెస్ట్‌చేసి వారివద్ద నుంచి రూ.31వేలు నగదుతోపాటు 5 ద్విచక్రవాహనాలు, 8 సెల్‌ఫోన్లను స్వాధీనం చేసుకున్నామని ఎస్‌ఐ శ్రీనివాసులు తెలిపారు. అందిన సమాచారం మేరకు దాడిచేసి అరెస్ట్‌చేశామన్నారు.

మాజీ మంత్రి కాలవకు ఎస్సీ సెల్ సన్మానం

రాయదుర్గం, జనవరి 25: తెలుగుదేశం పార్టీ రాష్ట్ర ఎస్సీ సెల్ కార్యనిర్వాహక కార్యదర్శి చిన్నిక్రిష్టయ్య ఆధ్వర్యంలో గురువారం మాజీ మంత్రి, టీడీపీ పొలిట్ బ్యూరో సభ్యులు కాలవ శ్రీనివాసులును సన్మానించారు. కార్యక్రమంలో జిల్లా అధికార ప్రతినిధి అంజి, సోషియల్ మీడియా ఇన్‌చార్జి రవిచంద్ర, నాయకులు మల్లికార్జున, వన్నూరుస్వామి తదితరులు పాల్గొన్నారు.

'గుత్తి కోటలో షూటింగ్‌లు చేయండి'

గుత్తి, జనవరి 25: గుత్తికోటలో సినిమా షూటింగ్‌లు చేయాలని గుత్తికోట పరిరక్షణ కమిటీ ఆధ్వర్యంలో సినీ హీరో సుమన్‌ను కలిసి విన్నవించారు. పట్టణ శివారులోని జాతీయ రహదారిలోని ఓ హోటల్‌లో సినీనటుడు సుమన్‌ను కమిటీ నాయకులు ఇస్మాయిల్, విరూపాక్షిరెడ్డి కలిశారు. సినిమాలు తీయడానికి మంచి అనువైన ప్రదేశమని పేర్కొన్నారు.

నక్కదాడిలో పదిమందికి గాయాలు

రాయదుర్గంరూరల్, జనవరి 25: మండలంలోని బొమ్మక్కపల్లి గ్రామంలో నక్క ఎస్సీకాలనీలోకి ప్రవేశించి ఎనిమిదిమందిని గాయపరిచిన సంఘటన గురువారం తెల్లవారుజామున చోటు చేసుకుంది. గురువారం తెల్లవారుజామున బహిర్భూమికి వెళుతుండగా చెరువులో నుంచి నక్క ఎస్సీ కాలనీలోకి ప్రవేశించి దాడి చేసినట్లు గ్రామస్థులు తెలిపారు. గాయపడిన గణేష్, వన్నూరప్ప, బసన్న, పెద్ద బసప్పలతోపాటు మరికొందరిని రాయదుర్గం ప్రభుత్వాసుపత్రికి తరలించి చికిత్స అందించినట్లు వివరించారు.